epaper.samayamdaily.net APTEL/2006/18267
# సమయం
మన గొంతుకే.. మన పత్రిక | తెలుగు దినపత్రిక

SAMAYAM

సంపుటి : 18 సంచిక : 314 | ఎడిటర్ : విక్రం కుమార్ | గురువారం 24, జులై 2025 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 8 | వెల: రూ.5

epaper.samayamdaily.net APTEL/2006/18267
సమయం
మన గొంతుకే.. మన పత్రిక తెలుగు దినపత్రిక

**విలేకరులు కావలెను**

తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ప్రజాదరణ పొందుతున్న సమయం న్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రికకు విలేకరులు కావలెను.

ఆసక్తి అనుభవం కలిగిన వారు సంప్రదించగలరు.

జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గాల వారీగా ఆర్సీ ఇంచార్జీలు, మండలాల వారీగా విలేకరులు కావలెను. సీనియర్లకు ప్రాధాన్యం కొత్తవారికి అవకాశం ఉంటుంది.

ఫోన్ నెం : 99483 13985/ 89789 60131



‘మహాలక్ష్మి’తో..

## ఆర్టీసీ బలోపేతం...

- రాష్ట్రంలో రూ.20 వేల కోట్లతో రోడ్ల మరమ్మతులకు ప్రణాళిక
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడి
- ఎంజీబీఎస్‌లో ఘనంగా మహిళల 200 కోట్ల ప్రయాణ వేడుకలు

2లో

## 42 శాతం బీసీ రిజర్వేషన్లు సాధిస్తాం

- అందుకోసం భాజపా మెడలు వంచుతాం
- బీసీల్లో ముస్లింలను కలిపి రిజర్వేషన్లు కల్పించడంపై ఆ పార్టీది తొండి వాదన
- గుజరాత్, ఉత్తర్‌ప్రదేశ్, మహారాష్ట్రల్లోనూ ముస్లింలకు రిజర్వేషన్లు
- ఆ విషయం అమిత్‌షా కూడా చెప్పారు
- అది తప్పయితే పార్టీ నుంచి ఆయన్ను బహిష్కరించండి
- ఉపరాష్ట్రపతిగా దత్తాత్రేయకు అవకాశం ఇవ్వాలి
- ఢిల్లీలో సీఎం రేవంత్‌రెడ్డి

2లో



# మాటల యుద్ధానికి ముహూర్తం ఖరారు..

- ఆపరేషన్ సిందూర్‌పై చర్చకు సరేనన్న సర్కారు
- 28న లోక్‌సభలో.. మరుసటిరోజు రాజ్యసభలో
- ఒక్కోసభకు 16 గంటలు కేటాయింపు
- విపక్షాల నిరసనలతో మూడోరోజూ స్తంభించిన పార్లమెంటు



**జులై 23, సమయం న్యూస్, ఢిల్లీ:** పాక్ ఉగ్రవాద స్థావరాల మీద మన సైన్యం ఇటీవల విజయవంతంగా చేపట్టిన ‘ఆపరేషన్ సిందూర్’పై పార్లమెంటులో చర్చకు రంగం సిద్ధమైంది. పహల్గాం ఉగ్రదాడితో ముడిపడిన పరిణామాలపై సమగ్ర చర్చ జరగాలని, తాము లేవనెత్తే ప్రశ్నలకు ప్రధాని నరేంద్ర మోదీ పార్లమెంటులోనే సమాధానాలు చెప్పాలని విపక్షం గట్టిగా డిమాండ్ చేస్తున్న విషయం తెలిసిందే. అయితే ప్రధాని బుధవారం విదేశీ పర్యటనకు వెళ్లారు. 26న తిరుగుప్రయాణం అవుతారు. విపక్షాల డిమాండ్ మేరకు ఆపరేషన్ సిందూర్‌పై చర్చకు మొత్తంగా 16 గంటల సమయం కేటాయించాలని బుధవారం రాజ్యసభ ‘సభా వ్యవహారాల సంఘం’ (బీఏసీ) నిర్ణయించింది. లోక్‌సభ బీఏసీ సోమవారమే ఈ నిర్ణయం తీసుకుంది. ఈ నెల 28న దిగువ సభలో, మరుసటిరోజు ఎగువసభలో చర్చ ప్రారంభం కానుంది. చర్చకు మోదీ

తరువాయి 2లో




భవిష్యత్తులో...

## విద్యుత్, ఇంటెలిజెన్స్ గ్రిడ్లు

- పాలనలో ఏఐ కీలకంగా మారుతుంది
- రాష్ట్రంలో డేటా సెంటర్ల ఏర్పాటుకు విస్తృత అవకాశం
- ఫైర్‌సైడ్ చాట్‌లో మంత్రి లోకేశ్, జీ42 ఇండియా సీఈవో మనూ జైన్ వెల్లడి

**జులై 23, సమయం న్యూస్, అమరావతి:** రాష్ట్రం డిజిటల్ పవర్‌హౌస్‌గా మారనుందని మంత్రి నారా లోకేశ్ అభిప్రాయపడ్డారు. యువతకు ఉద్యోగాలు కల్పించడంతోపాటు.. నవకల్పనలకు అవకాశాలు వస్తాయన్నారు. డేటా విప్లవం ద్వారా

తరువాయి 2లో

## రేసులో ఆరుగురు ?

- ఉప రాష్ట్రపతి పదవిపై పలు ఊహాగానాలు
- మళ్లీ గవర్నర్‌కే దక్కుతుందా?





జగదీప్ ధన్‌ఖడ్ ఆకస్మిక రాజీనామాతో ఖాళీ అయిన ఉప రాష్ట్రపతి పదవికి ఎన్డీయే కూటమి.. ఎవరిని ఎంపిక చేస్తుందన్న దానిపై ఆసక్తి నెలకొంది. ఈ రేసులో ప్రధానంగా ఆరుగురి పేర్లు వినిపిస్తున్నాయి. అందులో సీఎం, గవర్నర్లు, ఎంపీలున్నారు. ఈ ఏడాది అక్టోబరు, నవంబరులో బిహార్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ క్రమంలో ఉప రాష్ట్రపతి అభ్యర్థిత్వాన్ని మొదటగా పరిశీలించేది బిహార్ నుంచే అన్న ఉహాగానాలు జోరుగా వినిపిస్తున్నాయి. ఇందులో ప్రధానంగా మూడు పేర్లు వినిపిస్తున్నాయి. సీఎం నీతీశ్ కుమార్, జేడీయూ ఎంపీ, ప్రస్తుత రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్ నారాయణ్ సింగ్‌తోపాటు

తరువాయి 2లో











2లో

## ఏడాదిలో పెట్టుబడుల లక్ష్యం రూ.10 లక్షల కోట్లు

- ప్రాజెక్టులకు ఫెసిలిటేటర్‌గా వ్యవహరిస్తా
- సీఎంవో నుంచే పర్యవేక్షణ
- ఇన్వెస్టోపియా గ్లోబల్ ఏపీ-2025 లో సీఎం చంద్రబాబు



**జులై 23, సమయం న్యూస్, అమరావతి :** ఏడాదిలో రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించాలన్నదే లక్ష్యమని..అందుకు అనుగుణంగా 15 రంగాల్లో పాలసీలు తీసుకొచ్చినట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)కు చెందిన ఇన్వెస్టోపియా, ఆంధ్రప్రదేశ్ ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డు (ఏపీ ఈడీబీ )భాగస్వామ్యంతో విజయవాడలో బుధవారం నిర్వహించిన ఇన్వెస్టోపియా గ్లోబల్ ఏపీ2025 సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సంద[ర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ‘యూఏఈ నుంచి అమరావతి సహా ఇతర చోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ఆహ్వానిస్తున్నాం. ఏపీని పరిశీలించిన తర్వాతే పెట్టుబడులపై నిర్ణయం తీసుకోండి. ప్రాజెక్టుల సాకారం

తరువాయి 2లో



## స్థానిక ఎన్నికల్లో సామాజిక న్యాయమే అస్త్రం

- బడుగుల సంక్షేమమే ధ్యేయమని చాటేందుకు కాంగ్రెస్ కసరత్తు
- కులగణన, బీసీ రిజర్వేషన్లపై నేడు ఢిల్లీలో సీఎం ప్రజంటేషన్

2లో

## మాటల యుద్ధానికి ముహూర్తం ఖరారు

(మొదటిపేజీ తరువాయి)

సమాధానం ఇస్తారా, లేదా అనేది ఇంకా తేలకపోయినా.. ఉగ్రవాదంపై భారత్ వైఖరిని విదేశాలకూ మరోసారి స్పష్టంచేసేలా ఆయన మాట్లాడే అవకాశం ఉందని భాజపా సీనియర్ నేత ఒకరు వెల్లడించారు. చర్చ సమయంలో మోదీ పార్లమెంటులో ఉండాలని తాము బీఏసీ సమావేశంలో డిమాండ్ చేశామని, ప్రభుత్వం దానికి భరోసా ఇచ్చిందని రాజ్యసభలో కాంగ్రెస్‌పక్ష ఉప నాయకుడు ప్రమోద్ తివారీ విలేకరులకు తెలిపారు. వర్షాకాల సమావేశాలు మొదలయ్యాక రాజ్యసభ బీఏసీ సమావేశం జరగడం ఇదే ప్రథమం. డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్ దీనికి అధ్యక్షత వహించారు. బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (ఎస్ఐఆర్)పై చర్చకు విపక్షాలు రాజ్యసభలో మరోసారి డిమాండ్ చేశాయి. వాయిదా తీర్మాన నోటీసులిచ్చి.. కార్యకలాపాలను అడ్డుకున్నాయి. సభను మూడుసార్లు కొంతసేపు వాయిదా వేయాల్సి వచ్చింది. నోటీసులను తిరస్కరించి చివరకు గురువారానికి వాయిదావేశారు.

**సభలో ఇలా ప్రవర్తిస్తే సహించను: ఓంబిర్లా**

ఎన్నిసార్లు వారిస్తున్నా సమావేశాలకు కొందరు ఎంపీలు నినాద ఫలకాలతో (ప్లకార్డులతో) వస్తుండటంపై లోక్‌సభలో స్పీకర్ ఓంబిర్లా మండిపడ్డారు. వీధుల్లో ప్రవర్తించినట్లు ఇక్కడా చేస్తే సహించేదిలేదని హెచ్చరించారు. బిహార్ ఓటర్ల జాబితా విషయంలో పలువురు సభ్యులు తన పీఠం వద్దకు వచ్చిమరీ ఆందోళన నిర్వహిస్తుండటంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేస్తూ ''ప్రజలు ఏ ఆశలు, ఆకాంక్షలతో మిమ్మల్ని ఎన్నుకున్నారో దానికి తగ్గట్టు మీ ప్రవర్తన ఉండాలి. ప్రజల జీవితాలను సరళతరం చేయడానికి దోహదపడేలా చర్చల్లో మీరు పాల్గొనాలి. పార్లమెంటేరియన్లలా మీరుండాలి. సభలోకి ప్లకార్డులు తీసుకురాకూడదు. మీరు దీనిని ఇలాగే కొనసాగిస్తే నేను నిర్ణయాత్మక చర్యలు చేపట్టక తప్పదు'' అని హెచ్చరించి సభను కొంతసేపు వాయిదావేశారు. తర్వాతా పరిస్థితిలో మార్పులేక గురువారానికి వాయిదావేశారు. వరసగా మూడోరోజూ పార్లమెంటు కార్యకలాపాలు దాదాపు స్తంభించిపోయాయి.

## 'మహాలక్ష్మి'తో ఆర్టీసీ బలోపేతం

హైదరాబాద్: మహాలక్ష్మి పథకం కింద మహిళల ఉచిత ప్రయాణాలతో ఆర్టీసీ ఆర్థికంగా బలోపేతం అవుతోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ఈ పథకానికి సంబంధించి జీరో టికెట్ల మొత్తాన్ని ప్రభుత్వం ఎప్పటికప్పుడు సంస్థకు చెల్లిస్తోందన్నారు. బుధవారం ఎంజీబీఎస్‌లో నిర్వహించిన మహాలక్ష్మి మహిళల 200 కోట్ల ప్రయాణ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ''కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 2,400 కొత్త బస్సులను ఆర్టీసీ కొనుగోలు చేసింది. హైదరాబాద్‌ను కాలుష్య రహిత నగరంగా మార్చేందుకు 2,800 ఎలక్ట్రిక్ బస్సులను కొనేందుకు సంస్థ కసరత్తు చేస్తోంది. ఉచిత ప్రయాణమే కాదు.. బస్సులకు అతివలను యజమానులను చేశాం. రాష్ట్రవ్యాప్తంగా రూ.20 వేల కోట్లతో రోడ్ల మరమ్మతులు, అభివృద్ధి చేయడానికి సర్కారు ప్రణాళికలు రూపొందిస్తోంది. ఆర్టీసీ మునిగిపోతున్న పడవ కాదు... లాభాల్లోకి వస్తున్న ప్రభుత్వ సంస్థ. వచ్చిన ఆదాయంతో కొత్త బస్సులు కొంటోంది. మహాలక్ష్మి పథకానికి ముందు ఒక్క రోజు 45 లక్షల మంది ప్రయాణం చేస్తే ప్రస్తుతం 65 లక్షల మంది ప్రయాణిస్తున్నారు'' అని వివరించారు. అనంతరం రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్... పథకాన్ని విజయవంతంగా అమలు చేస్తున్న ఆర్టీసీ సిబ్బందిని అభినందించారు. మహిళలు 200 కోట్ల ప్రయాణాలు చేసిన సందర్భంగా రాష్ట్రంలోని 97 డిపోలు, 324 బస్‌స్టేషన్లలో ఘనంగా వేడుకలను నిర్వహిస్తున్నామన్నారు. పెరిగిన రద్దీకి అనుగుణంగా కొత్త బస్సుల కొనుగోలుతో పాటు నియామకాలను చేపడుతున్నట్లు వెల్లడించారు. రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజా రవాణా వ్యవస్థను బలోపేతం చేసే దిశగా ప్రతి గ్రామం నుంచి మండలానికి, మండల కేంద్రం నుంచి జిల్లా కేంద్రానికి కొత్త రహదారుల నిర్మాణాన్ని త్వరలోనే ప్రారంభిస్తామని ప్రకటించారు. ఆర్టీసీ ఎండీ సజ్జనార్ మాట్లాడుతూ.. ఈ పథకం అమలుకు ముందు ఆక్యుపెన్సీ రేషియో (ఓఆర్) 69శాతం ఉండగా.. ప్రస్తుతం 97 శాతానికి పెరిగిందన్నారు. అనంతరం ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని వినియోగించుకుంటున్న పలువురు మహిళలను, పథకాన్ని సమర్థంగా అమలు చేస్తున్న ఆర్టీసీ సిబ్బందిని మంత్రులు సన్మానించారు. 200 కోట్ల ప్రయాణాల ద్వారా మహిళలు ఆదా చేసుకున్న రూ.6,680 కోట్ల చెక్‌ను ప్రభుత్వం తరపున ఆర్టీసీ ఉన్నతాధికారులకు అందజేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, రవాణాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

## రేసులో ఆరుగురు?

(మొదటిపేజీ తరువాయి)

బిహార్ గవర్నర్‌గా ఉన్న ఆరిఫ్ మహమ్మద్ ఖాన్. వీరిలో ఒకరికి పదవి దక్కొచ్చనే ప్రచారం జరుగుతోంది. ఉప రాష్ట్రపతి అభ్యర్థి రేసులో నీతీశ్ కుమార్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. ఆశ్చర్యకరంగా బిహార్‌కు చెందిన భాజపా ముఖ్య నేతలు ఆయనను ఉప రాష్ట్రపతి చేయాలని బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు. అయితే ఈ ఆఫర్‌ను నీతీశ్ అంగీకరించే అవకాశాలు చాలా తక్కువే. కానీ నీతీశ్ రాష్ట్ర రాజకీయాల్లో ఉండగా భాజపా అభ్యర్థి సీఎం కావడం అసాధ్యం. అందుకే నీతీశ్‌ను ఒప్పించేందుకు భాజపా వ్యూహాత్మంగా పావులు కదుపుతున్నట్లు సమాచారం. ఇందుకోసం నీతీశ్‌ను ఉప రాష్ట్రపతి చేసి, ఆయన కుమారుడు నిశాంత్ కుమార్‌ను డిప్యూటీ సీఎం చేసే అవకాశాలూ లేకపోలేదని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. బిహార్‌లోని బీసీ, ఈబీసీ వర్గాల ఓటర్లు ఎన్‌డీఏ కూటమి వైపు మొగ్గడానికి ప్రధాన కారకుడు నీతీశ్ కుమార్ అని, ఎన్నికల ముంగిట ఆయన్ను బలవంతంగా దూరం చేసుకోవడానికి ఆ కూటమి అస్సలు సాహసించదని ఇంకొందరు పరిశీలకులు తెలిపారు. జేడీయూ నేత హరివంశ్ నారాయణ్ సింగ్ ఉప రాష్ట్రపతి రేసులో ఉన్నారు. జేడీయూ ఎంపీ కావడం ఆయనకు కలిసివచ్చే అంశం. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి హరివంశ్ అత్యంత సన్నిహితంగా ఉంటారు. కేంద్ర ప్రభుత్వానికి విధేయులుగా ఉన్న పలువురు గవర్నర్ల పేర్లను ఉప రాష్ట్రపతి పదవికి పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఈ కేటగిరీ నుంచి ప్రముఖంగా వినిపిస్తున్న పేరు ఆరిఫ్ మహ్మద్ ఖాన్. ఈయన ప్రస్తుతం బిహార్ గవర్నర్‌గా ఉన్నారు. హిందూ పురాణాలు, గ్రంథాలపై అవగాహన కలిగిన పండితుడిగా ఆరిఫ్‌కు భాజపాలో మంచి గుర్తింపు ఉంది. ముస్లిం వర్గానికి చెందిన ఆయనను ఉప రాష్ట్రపతి చేస్తే.. ముస్లిం ఓటర్లు పెద్ద సంఖ్యలో ఉన్న బిహార్‌లో కలిసొస్తుందనే అంచనాతో ఎన్‌డీఏ కూటమి పెద్దలు ఉన్నారని అంటున్నారు. అయితే ఆర్జేడీ అధినేత లాలూతో ఆరిఫ్‌కు సాన్నిహిత్యం ఉంది. దిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీని ముప్పుతిప్పలు పెట్టిన లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనాను ఉప రాష్ట్రపతి పదవికి పరిశీలిస్తారనే అంచనాలున్నాయి. జమ్మూ కశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్‌గా ఉన్న మనోజ్ సిన్హా పేరూ తెరపైకి వస్తోంది. ఆయన కశ్మీరు పాలనలో తనదైన ముద్ర వేస్తూ ముందుకు సాగుతున్నారు. ఆయన పదవీ కాలం ఈ ఏడాది ఆగస్టు 6తో ముగియనుంది. ఉప రాష్ట్రపతి అభ్యర్థి ఎంపిక విషయంలో భాజపా అనూహ్య నిర్ణయం తీసుకునే అవకాశాలూ లేకపోలేదంటున్నారు. కాంగ్రెస్ నుంచి ఎంపీగా గెలిచిన సీనియర్ నేత శశి థరూర్ పేరునూ ప్రధాని మోదీ పరిశీలించే అవకాశం ఉందనే ప్రచారం జరుగుతోంది.

# 42 శాతం బీసీ రిజర్వేషన్లు సాధిస్తాం...

దిల్లీ: కేంద్ర ప్రభుత్వంలో ఉన్న భాజపా మెడలు వంచైనా తెలంగాణలో బీసీలకు విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల ఎన్నికల్లో 42% రిజర్వేషన్లు సాధించి తీరుతామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ధీమా వ్యక్తంచేశారు. బీసీల్లో ముస్లింలను కలిపి రిజర్వేషన్లు అమలుచేయడాన్ని అంగీకరించబోమన్న భాజపాది తొండి వాదన అని కొట్టిపారేశారు. బుధవారం ఇక్కడి తన అధికార నివాసంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ''బీసీ రిజర్వేషన్లపై శాసనసభలో చర్చ జరిగినప్పుడు భాజపా ఎమ్మెల్యేలు మద్దతు పలికారు. కానీ ఆ పార్టీ రాష్ట్ర నూతన అధ్యక్షుడు మాత్రం అందులోంచి ముస్లింలను తొలగించాలని వితండవాదం చేస్తున్నారు. ముస్లిం రిజర్వేషన్లపై కిషన్‌రెడ్డి, బండి సంజయ్, రామచందర్‌రావులు అవగాహన లేకుండా మాట్లాడుతున్నారు. ఆ పార్టీ అధికారంలో ఉన్న గుజరాత్, యూపీ, మహారాష్ట్రల్లో 40 50 ఏళ్ల నుంచి ముస్లిం రిజర్వేషన్లు అమలవుతున్నాయి. హోంమంత్రి అమిత్‌షా కూడా ఒక ఇంటర్వ్యూలో చెప్పారు. అది తప్పయితే ఆయనను భాజపా నుంచి బహిష్కరించండి. లేదా సస్పెండ్ చేయండి. మోదీ పుట్టిన, ప్రాతినిధ్యం వహిస్తున్న గుజరాత్, ఉత్తర్‌ప్రదేశ్, ఆర్ఎస్ఎస్ పుట్టిన మహారాష్ట్రల్లో ముస్లిం రిజర్వేషన్లు రద్దుచేసిన తర్వాతే తెలంగాణలో ఆ డిమాండ్ చేయాలి. ఆ పార్టీకి ధైర్యం ఉంటే ఆ మూడు రాష్ట్రాల్లో ముస్లిం రిజర్వేషన్లను రద్దుచేసి చూపాలి'' అని సీఎం రేవంత్‌రెడ్డి సవాల్ విసిరారు.

*** సెప్టెంబరు 30 లోపు అన్ని ఎన్నికలూ పూర్తిచేస్తాం**

'ఈ రిజర్వేషన్ల విషయంలో ఇండియా కూటమిలోని మిగిలిన పక్షాలను కూడా సమన్వయం చేసుకొని కేంద్రంపై ఒత్తిడి తెచ్చి తెలంగాణ ప్రజలకు న్యాయం చేయడానికి నేను ఇక్కడికొచ్చా. హైకోర్టు ఆదేశాల మేరకు 30 రోజుల్లో స్థానిక సంస్థల రిజర్వేషన్లను నిర్ణయించి సెప్టెంబరు 30 లోపు అన్ని ఎన్నికలూ పూర్తిచేయాలని రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. దాన్ని సాధించాలంటే రాష్ట్ర ప్రభుత్వం చేసిన బిల్లులను కేంద్ర ప్రభుత్వం ఆమోదించాలి. అందుకోసం దానిపై ఒత్తిడి తేవడానికి పార్లమెంటు సమావేశాలు జరుగుతున్న ప్రస్తుత తరుణంలో కాంగ్రెస్‌తోపాటు, ఇండియా కూటమి ఎంపీలను కలిసి రిజర్వేషన్లను సాధించి బలహీనవర్గాలకు న్యాయం చేయాలన్న లక్ష్యంతో దిల్లీకొచ్చా. అసెంబ్లీలో బిల్లులు చేసి కేంద్రానికి పంపిన విషయం గురించి గురువారం పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీని కలిసి వివరిస్తా. కాంగ్రెస్ ఎంపీలందరికీ కూడా ప్రజంటేషన్ ఇస్తా.

*** వివరాలు అసెంబ్లీలో పెడతాం...**

మేం నిర్వహించిన కులగణనకు సంబంధించిన అన్ని వివరాలూ అసెంబ్లీలో వెల్లడించాం. ఆ తర్వాత ఏర్పాటు చేసిన స్వతంత్ర కమిషన్ మూడురోజుల క్రితం నివేదిక ఇచ్చింది. దానిపై మంత్రివర్గంలో చర్చించి అసెంబ్లీలో పెట్టి ప్రజలకు పూర్తి వివరాలు వెల్లడిస్తాం. వాటిని బహిర్గతం చేసే ముందు న్యాయపరంగా ఎదురయ్యే సమస్యల గురించి చర్చించుకొని ఇవ్వాల్సి ఉంటుంది. వ్యక్తిగత వివరాలు బహిర్గతం చేయడానికి చట్టం అనుమతించదు. రాష్ట్రంలో 56.4% బీసీలు, 17.45% ఎస్సీలు, 10.8% ఎస్టీలు, 10.9% ఉన్నతవర్గాలు, ఏ కులమూ లేదని ప్రకటించుకున్నవారు దాదాపు 3.9% ఉన్నారు.

**అనడం.. పారిపోవడం భాజపాకు అలవాటు**

మూడు సాగు చట్టాలను రద్దు, జనగణనలో కులగణన అంశాలపై కేంద్రం దిగొచ్చింది. అనడం పారిపోవడం భాజపాకు అలవాటు. కేంద్ర ప్రభుత్వం 10% ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు అమల్లోకి తెచ్చిన తర్వాత 50% మూలసూత్రమే వర్తించదు. దానికి కాలంచెల్లిపోయింది. ఇప్పుడు 60% రిజర్వేషన్లు అమలవుతున్నాయి'' అని సీఎం పేర్కొన్నారు.

*** దత్తాత్రేయకు ఉపరాష్ట్రపతి పదవి ఇచ్చి భాజపా తన తప్పుల్ని సరిదిద్దుకోవాలి**

ఉపరాష్ట్రపతి స్థానాన్ని తెలంగాణకు చెందిన ఓబీసీ నాయకుడు బండారు దత్తాత్రేయకు ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. ''రాష్ట్రపతి పదవికి వెళ్లాల్సిన వెంకయ్యనాయుడిని ఇంటికి పంపారు. దత్తాత్రేయ లోక్‌సభ స్థానాన్ని తీసుకొని కిషన్‌రెడ్డికి... బండి సంజయ్ అధ్యక్ష స్థానాన్ని తొలుత కిషన్‌రెడ్డికి, ఇప్పుడు రామచందర్‌రావుకు ఇచ్చారు. అటు తెలుగువారికి, ఇటు వెనుకబడిన వర్గాలకు అన్యాయంచేసిన భాజపా ఇప్పుడు దత్తాత్రేయకు ఉపరాష్ట్రపతి పదవి ఇచ్చి తన తప్పుల్ని సరిదిద్దుకోవాలి'' అని అన్నారు. దత్తాత్రేయ అభ్యర్థిత్వానికి ఇండియా కూటమి మద్దతు ఇస్తుందా అన్న ప్రశ్నకు బదులిస్తూ ఆ విషయం తనకు తెలియదని, తాను తెలంగాణ ప్రజల తరఫున డిమాండ్ చేస్తున్నానని అన్నారు. భాజపా పెద్దలు దిల్లీలో ఎదిగిన తెలుగు నాయకత్వాన్ని పక్కకు తప్పించి మాకు ప్రాతినిధ్యమే లేకుండా చేశారని ఆరోపించారు. కనీసం తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలైనా దత్తాత్రేయకు మద్దతు పలుకుతారా అన్న ప్రశ్నకు స్పందిస్తూ కాంగ్రెస్ ఎంపీలు కేరళ, తెలంగాణ అని వేర్వేరుగా ఉండరని, అంతా కాంగ్రెస్‌కు చెందినవారే కాబట్టి దానిపై కేంద్ర నాయకత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందన్నారు. హిందీని దేశవ్యాప్తంగా రుద్దడానికి ప్రయత్నిస్తున్న కేంద్ర ప్రభుత్వం దేశంలో హిందీ తర్వాత అత్యధికంగా మాట్లాడే రెండో భాషగా గుర్తింపు పొందిన తెలుగును కనీసం ఉత్తర్‌ప్రదేశ్, బిహార్‌లలో మూడో భాషగా అమలుచేసి చూపాలని డిమాండ్ చేశారు.

*** ఎంపీ సీఎం రమేశ్ కంపెనీకి రోడ్ల కాంట్రాక్టు వచ్చిన మాట వాస్తవమే**

''రాష్ట్రంలో గత ప్రభుత్వ హయాంలో సొంత ఇళ్లలోని వారి ఫోన్లు కూడా ట్యాప్ చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. ఆ పరిస్థితి వచ్చిందంటే వారి మధ్య బంధాలు ఎలా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. లోకేశ్‌ను కేటీఆర్ కలవడాన్ని నేను తప్పుబట్టలేదు. నేను పగటి పూట చంద్రబాబును కలిస్తే విమర్శించిన కేటీఆర్.. చీకట్లో లోకేశ్‌ను కలవడాన్ని ఏమంటారని మాత్రమే ప్రశ్నించా. భాజపా ఎంపీ సీఎం రమేశ్ నేతృత్వంలోని రిత్విక్ కంపెనీకి ఫ్యూచర్‌సిటీలో రోడ్ల కాంట్రాక్టు వచ్చిన మాట వాస్తవమే. మేము టెండర్లు బహిరంగంగా పిలిచాం. వాళ్లు కూడా బహిరంగంగానే టెండర్లు వేశారు. ఇందులో దాయడానికి ఏమీలేదు'' అని రేవంత్ వివరించారు.

## ఏడాదిలో పెట్టుబడుల లక్ష్యం రూ.10 లక్షల కోట్లు

(మొదటిపేజీ తరువాయి)

కోసం ఫెసిలిటేటర్‌గా నేనే వ్యవహరిస్తా' అని పేర్కొన్నారు. రెండు ప్రాంతాల మధ్య వాణిజ్య బంధాన్ని బలోపేతం చేసేందుకు వీలుగా 'ఏపీఈడీబీ ఇన్వెస్టోపియా' మధ్య అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో యూఏఈ ఆర్థిక, పర్యాటకశాఖ మంత్రి అబ్దుల్లా బిన్ తౌక్ అల్ మారి, లులు గ్రూప్ ఛైర్మన్ యూసుఫ్ అలీ, ఇన్వెస్టోపియా సీఈఓ జీన్‌ఫేర్స్, రాష్ట్ర పరిశ్రమల మంత్రి టీజీ భరత్, సీఎస్ విజయానంద్ పాల్గొన్నారు.

*** అనుమతులపై సీఎంవో నుంచే పర్యవేక్షణ**

దేశంలోనే మొదటి హైడ్రోజన్ వ్యాలీని రాష్ట్రంలో ఏర్పాటు చేస్తున్నామని సీఎం తెలిపారు. 'రాష్ట్రానికి వచ్చే పెట్టుబడుల ప్రతిపాదనలను సీఎంవో నేరుగా పర్యవేక్షిస్తుంది. రాష్ట్రంలో పోర్టులు, ఎయిర్ పోర్టులు, మౌలిక సదుపాయాలు ఉన్నాయి. నీటి వనరులు, వ్యవసాయ రంగంలో ఏపీ అగ్రస్థానంలో ఉంది. డిజిటల్ టెక్నాలజీ, మానవ వనరుల పరంగానూ బలంగా ఉంది. ఆతిథ్య రంగం, ఆయిల్ అండ్ గ్యాస్, పెట్రో కెమికల్స్ రంగంలో విస్తృత అవకాశాలు ఉన్నాయి. పాలసీ నిబంధనలకు అనుగుణంగా పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహకాలను చెల్లిస్తాం. గూగుల్ సంస్థ త్వరలో విశాఖలో అతిపెద్ద డేటా సెంటర్‌ను ఏర్పాటు చేయబోతోంది' అని వివరించారు.

*** లులు వెళ్లి.. వెనక్కి వచ్చింది!**

లులు సంస్థ అంతర్జాతీయ స్థాయి షాపింగ్ మాళ్లను విశాఖ, విజయవాడల్లో ఏర్పాటు చేస్తోందని సీఎం తెలిపారు. అమరావతిలోనూ త్వరలో ఏర్పాటు చేయాలని కోరామన్నారు. 'గత ప్రభుత్వ హయాంలో వివిధ కారణాల వల్ల లులు రాష్ట్రం నుంచి తప్పుకొంది. కూటమి అధికారంలోకి వచ్చాక తిరిగి పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చింది. విశ్వసనీయతకు ఇదొక నిదర్శనం' అని పేర్కొన్నారు.

*** ఆరు నెలల్లోనే యూఏఈ సదస్సు**

ఈ ఏడాది జనవరిలో దావోస్‌లో జరిగిన ప్రపంచ దేశాల ఆర్థిక సదస్సులో యూఏఈ ఆర్థిక మంత్రి అబ్దుల్లా బిన్ తౌక్ అల్ మారిని కలిసి ఏపీకి ఆహ్వానించినట్లు సీఎం చెప్పారు. అప్పుడు ఇచ్చిన హామీ మేరకు యూఏఈ మొదటగా ఏపీలో ఇన్వెస్టోపియా సదస్సు నిర్వహించిందన్నారు. 'యూఏఈ నుంచి 50 బిలియన్ డాలర్ల పెట్టుబడులు ఆశిస్తున్నామని యూఏఈ ప్రతినిధులతో నిర్వహించిన సమావేశాల్లో ప్రస్తావిస్తే.. అంతకు మించే వస్తాయని వారు హామీ ఇచ్చారు. పెట్టుబడులు పెట్టేందుకు వివిధ దేశాల్లో జరిపే పర్యటనల సమయంలో 25 శాతాన్ని ఏపీకి కేటాయించాలి' అని సీఎం కోరారు.

## భవిష్యత్తులో విద్యుత్, ఇంటెలిజెన్స్ గ్రిడ్లు

(మొదటిపేజీ తరువాయి)

అంతర్జాతీయంగా వచ్చే అవకాశాలను అందిపుచ్చుకోవడంలో రాష్ట్రం ముందువరుసలో ఉంటుందని పేర్కొన్నారు. విజయవాడలో నిర్వహించిన ఇన్వెస్టోపియా గ్లోబల్ ఏపీ 2025 సదస్సులో భాగంగా పెట్టుబడులకు ముఖద్వారంగా రాష్ట్రం, యూఏఈ పెట్టుబడులు భాగస్వామ్యాలు, వ్యవసాయ సాంకేతికత, ఆహార భద్రత, ఏఐ, డేటా సెంటర్లు.. స్మార్ట్ గవర్నెన్స్ అంశాలపై చర్చలు జరిగాయి. ఏఐ, డేటా సెంటర్లు ఆధునిక ఆర్థిక వ్యవస్థకు కీలక మార్గంగా మారుతున్నాయా? అనే అంశంపై నిర్వహించిన ఫైర్‌సైడ్ చాట్‌లో మంత్రి లోకేశ్, జి 42 ఇండియా సీఈవో మనూ జైన్ పాల్గొన్నారు. మోడరేటర్ రక్షా శారద అడిగిన ప్రశ్నలకు ఇద్దరూ ఆసక్తికర సమాధానాలు ఇచ్చారు. అవి ఇలా..

మోడరేటర్: డేటా సెంటర్లు.. ఆర్థికాభివృద్ధి అవకాశాలపై మీ అభిప్రాయాలు ఏంటి?

మనూ: సీఎం చంద్రబాబును 2015 జూన్‌లో తొలిసారి కలిశాను. దేశంలో 'షావోమి'ని మొదటిసారి ప్రారంభించాలని వచ్చి.. ఏపీని అనువైన ప్రాంతంగా ఎంచుకున్నాం. ఇప్పుడు షావోమి దేశంలోనే అతి పెద్ద కంపెనీ. రాష్ట్రం నుంచే తయారీ జరుగుతోంది.

లోకేశ్: ఏఐ ద్వారా పాలనను చాలా సులువుగా.. ప్రజలకు అందుబాటులో ఉండేలా చేయవచ్చనేది తెలుసుకున్నా. నేను పాదయాత్ర చేసేప్పుడు భూముల రికార్డుల కోసం ప్రజలు పడే ఇబ్బందులను గమనించా. భూ రికార్డుల్లో ఉన్న తప్పులను సవరించేందుకు ఏఐ వినియోగించి రికార్డులు సరిచేస్తున్నాం. ఏఐని వినియోగించి ప్రజలకు సులువుగా సేవలు అందించడంపై దృష్టి పెట్టా. దీని కోసం వివిధ ప్రభుత్వ శాఖలను అనుసంధానిస్తూ డేటా లేక్ రూపొందించాం.

మోడరేటర్: ఏఐ, డేటా సెంటర్ల భవిష్యత్తును ఎలా చూస్తున్నారు?

మనూ: 25 ఏళ్ల కిందట ఇంటర్నెట్ కొత్తగా వచ్చిన సమయంలో.. ప్రజల జీవితాన్ని మార్చేస్తుందని భయపడ్డారు. దాని సాయంతో ఇప్పుడు 10 నిమిషాల్లో ఆహారం ఆర్డర్ చేసుకోవచ్చు. ప్రపంచంలో ఎక్కడున్నా వీడియో కాల్స్ చేసుకోవచ్చు. రాబోయే 25 ఏళ్లలో ఏఐ, డేటా సెంటర్లు సాంకేతికంగా కీలకం కాబోతున్నాయి. ప్రస్తుతం ఎలక్ట్రిక్ గ్రిడ్ మాత్రమే ఉంది. 25 ఏళ్ల తర్వాత వచ్చే జెనరేషన్ రెండు గ్రిడ్‌లు (ఎలక్ట్రిక్ గ్రిడ్.. ఇంటెలిజెన్స్ గ్రిడ్) వాడతారు.

మోడరేటర్: క్వాంటమ్ కంప్యూటింగ్.. డేటా లేక్స్ లాంటి వాటిపై మాట్లాడుతుంటే.. యూఏఈతో కలిసి పనిచేయడం వల్ల లాభం ఉంటుందా?

లోకేశ్: ఏపీలో డేటా సెంటర్లు వినూత్న ఆవిష్కరణలకు కేంద్రాలుగా మారతాయి. ఇదే దృష్టితో 201718లో ఆలోచించాం. అప్పట్లో చాట్ జీపీటీ లాంటిది లేదు. విశాఖను దేశానికి డేటా సిటీగా మార్చాలని నిర్ణయించాం. గత ఐదేళ్లలో చిన్న అడ్డంకి వతచ్చింది. ఇప్పుడు సాంకేతికత అందిపుచ్చుకునేందుకు వేగంగా అడుగులు వేస్తున్నాం. ఈ విషయంలో జీ 42 సహకరిస్తుందని భావిస్తున్నాం.

## స్థానిక ఎన్నికల్లో సామాజిక న్యాయమే అస్త్రం

హైదరాబాద్: సామాజిక న్యాయమే ప్రధాన అస్త్రంగా స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని కాంగ్రెస్ పార్టీ యోచిస్తోంది. దేశంలో ఎక్కడా లేనివిధంగా బీసీలకు ఏకంగా 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తున్నట్లు ఇప్పటికే ప్రకటించింది. బడుగులకు సామాజిక న్యాయం దక్కాలంటే 42 శాతం రిజర్వేషన్లకు పార్లమెంటులో బిల్లు ఆమోదించాలని కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకే... కులగణన సర్వే తీరుపై ఎంపీలకు గురువారం ప్రజంటేషన్ ఇవ్వడానికి దిల్లీని సీఎం రేవంత్‌రెడ్డి వేదికగా ఎంచుకున్నారని పార్టీవర్గాలు తెలిపాయి. దేశంలో తొలిసారిగా తెలంగాణ రాష్ట్రంలోనే పారదర్శకంగా, పకడ్బందీగా కులగణన చేశామని పేర్కొంటూ... ప్రజంటేషన్ ఇవ్వబోతున్నారు. దీనివల్ల బడుగు, బలహీనవర్గాల సంక్షేమం, సామాజిక న్యాయం కాంగ్రెస్‌కే సాధ్యమనే అంశానికి దేశవ్యాప్తంగా ప్రచారం కల్పించడానికి వీలవుతుందని పార్టీ భావిస్తోంది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై అసెంబ్లీలో తీర్మానానికి భాజపా, భారాస ఎమ్మెల్యేలు మద్దతిచ్చారు. రాజ్యాంగంలోని 9వ షెడ్యూలులో రిజర్వేషన్ల పెంపు అంశాన్ని చేర్చాలంటే పార్లమెంటు ఆమోదం తప్పనిసరి. ఒకవేళ కేంద్రంలోని భాజపా ప్రభుత్వం అందుకు నిరాకరిస్తే ఆ పార్టీ ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందంటూ ప్రజల్లోకి తీసుకెళ్లాలని కాంగ్రెస్ వ్యూహం రచిస్తోంది. మరోవైపు, శాసనసభలో రిజర్వేషన్ల తీర్మానాన్ని భారాస సమర్థించినందువల్ల పార్లమెంటులో ఆమోదం కోసం భాజపాపై ఆ పార్టీ కూడా ఒత్తిడి తేవాలని కాంగ్రెస్ నేతలు కోరుతున్నారు. ఒకవేళ దిల్లీలో భాజపా వైఖరిని భారాస సమర్థిస్తే స్థానిక సంస్థల ఎన్నికల్లో నిలదీస్తామని చెబుతున్నారు.

*** సాధారణ ఎన్నికలకూ అదే ఎజెండా...**

స్థానిక సంస్థల ఎన్నికల్లోనే కాకుండా వచ్చే అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లోనూ సామాజిక న్యాయం, బీసీలకు రిజర్వేషన్ల కల్పనే ప్రధాన ఎజెండాగా ముందుకెళ్లాలని యోచిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ వర్గాలు తెలిపాయి. ఇంతకాలం పలు సామాజిక వర్గాలకు సరైన రాజకీయ ప్రాతినిధ్యం దక్కలేదని, చట్టసభలకు ఒక్కసారి కూడా ఎన్నిక కాలేదని కులగణనలో గుర్తించినట్లు తెలుస్తోంది.

epaper.samayamdaily.net
APTEL/2006/18267
సమయం
మన గొంతుకే.. మన పత్రిక



ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డిని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పరామర్శించారు. కాలికి చికిత్స అనంతరం విశ్రాంతి లో ఉన్న పల్లా రాజేశ్వర్ రెడ్డిని బుధవారం మొయినా బాద్ లోని నివాసానికి వెళ్లి పరామర్శించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకొని ప్రజా సేవలోకి రావాలని ఆకాంక్షించారు.

# మహిళా శక్తి సంబరాలు..

* జిల్లా కలెక్టర్ రాజర్షి షా

ఆదిలాబాద్, జులై 23 (సమయం న్యూస్) : రాష్ట్ర ప్రభుత్వం మహిళల కొరకు ఎన్నో పథకాలు అమలుచేస్తూ వారి అభివృద్ధికి తోడ్పాటునందిస్తూ మహిళలను కోటీశ్వరులు చేయాలన్న దృఢ సంకల్పంతో అభ్యున్నతికి కృషి చేస్తుందని అన్నారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు ప్రభుత్వం కల్పించిన ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణ సదుపాయాన్ని 200 కోట్ల మంది వినియోగించుకున్న సందర్భంగా బుధవారం జిల్లా కేంద్రం లోని ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణం లో ఘనంగా సంబురాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మహాలక్ష్మి పథకాన్ని అమలులోకి తెస్తూ, మహిళలకు ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణ వసతిని కల్పించిందని గుర్తు చేశారు. ఈ పథకం ద్వారా రాష్ట్రంలో 200 కోట్ల



మంది మహిళలు ఉచిత ప్రయాణ సదుపాయాన్ని వినియోగించుకున్నారని వివరించారు. తద్వారా ప్రయాణ ఛార్జీల రూపంలో రూ. 6680 కోట్లు మహిళలకు ఆదా అయ్యాయని అన్నారు. ఈ మొత్తాన్ని ఆర్టీసీ సంస్థకు ప్రభుత్వం చెల్లిస్తోందని తెలిపారు. జిల్లాలో 1.75 కోట్ల మంది మహిళలు ఉచిత ప్రయాణం చేసుకున్నారని తెలిపారు. ఉచిత ప్రయాణ వసతి వల్ల మహిళలు తమ అవసరాల నిమిత్తం విరివిగా ప్రయాణ సదుపాయాన్ని వినియోగిస్తున్నారని అన్నారు. పురుషులతో సమానంగా మహిళలు ప్రయాణ వసతి పొందుతున్నారని అన్నారు. ఆర్టీసీ బస్సులలో ప్రయాణించే మహిళల సంఖ్య గణనీయంగా రోజూ రోజుకు పెరుగుతున్నదని, ఉచిత ప్రయాణ సదుపాయాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ సంస్థ ద్వారా ఆయా పాఠశాలల విద్యార్థినులకు నిర్వహించిన వ్యాస రచన పోటీలలో గెలుపొందిన బాలికలకు కలెక్టర్ చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. పలువురు మహిళా ప్రయాణికులను, ఆర్టీసీ సిబ్బందిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ సలోని, ఆర్టీసీ రీజినల్ మేనేజర్ సోమరాజు భవాని ప్రసాద్, డిపో మేనేజర్ ప్రతిమ, సారధి కళాకారులు ప్రయాణికులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి..

* అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దు
* అత్యవసరమైతే డయల్ 100 నకు ఫోన్ చేసి పోలీస్ వారి సేవలు పొందండి : ఎస్పీ రోహిత్ రాజు



భద్రాద్రి,కొత్తగూడెం జులై 23 (సమయం న్యూస్): ఎడతెరిపి లేకుండా విస్తారంగా కురుస్తున్న వర్షాల వలన జిల్లాలోని నదులు,వాగులు,వంకలు,చెరువులు పొంగి ఉధృతంగా ప్రవహిస్తూ రోడ్లపైకి నీరు చేరే అవకాశం ఉన్నది.కావున కాలి నడకన మరియు వాహనాలతో ప్రజలు రోడ్లు దాటేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపిఎస్ గారు సూచించారు. సెల్ఫీల కోసం ఉధృతంగా ప్రవహిస్తున్న ప్రదేశాలకు వెళ్లి ప్రమాదాలకు గురి కావద్దని తెలిపారు. నదులు, వాగులు, వంకల వద్దకు జాలర్లు, ప్రజలు చేపల వేటకు వెళ్ళకూడదని సూచించారు.పశువులను కాయడానికి నదులు,వాగులు,వంకల పరిసర ప్రాంతాల దగ్గరకు వెళ్లకూడదని సూచించారు. సాధ్యమైనంత వరకు అత్యవసర సమయాల్లో తప్ప మిగిలిన సమయాలలో బయటకు రాకుండా ఉండడానికి ప్రయత్నించవలసిందిగా సూచించారు.జిల్లాపోలీసుయంత్రాంగం ఇతర శాఖలతో కలిసి ఇప్పటికే వర్షాల కారణంగా ప్రమాదకరంగా మారుతున్న రహదారులు మరియు చెరువులు,వాగులు,నదుల వద్ద ఎలాంటి ప్రమాదాలు జరగకుండా పటిష్టమైన చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలియజేసారు.వరదల్లో చిక్కుకుని ఆపదలో ఉన్న వారిని రక్షించడానికి జిల్లా పోలీస్ శాఖ తరపున 24×7 అందుబాటులో ఉండే విధంగా డిడిఆర్ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచడం జరిగిందని తెలిపారు. ప్రజలు ఎవరైనా విపత్కర పరిస్థితులను ఎదుర్కొంటున్నట్లయితే వెంటనే డయల్ 100 కి ఫోన్ చేసి సమాచారం అందించి పోలీసు వారి సేవలను పొందాలని కోరారు.ప్రమాదాలు వాటిల్లకుండా పోలీసు వారు చేపట్టే చర్యలకు ప్రజలు సహకరించాలని ఈ సందర్భంగా ఎస్పీ విజ్ఞప్తి చేశారు.



# ఎరువుల కృత్రిమ కొరతను సహించేది లేదు

* జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్
* ఎరువుల దుకాణాలు తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



నిర్మల్ జులై 23(సమయం న్యూస్) : రైతులకు ఎరువుల కొరత రాకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. బుధవారం నిర్మల్ మినీ ట్యాంక్‌బండ్ సమీపంలోని గాయత్రి ఫర్టిలైజర్‌తో పాటు కొండాపూర్ గ్రామంలోని శ్రీ సాయి ఎరువుల దుకాణాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణాలలో ఉన్న విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల ప్యాకింగ్ లేబుళ్లు, తయారీదారుల వివరాలు, గడువు తేదీలు, రిజిస్టర్లు, రసీదుల పుస్తకాలను పరిశీలించారు. అన్ని రికార్డులు సరిగ్గా నిర్వహించాలని యజమానులకు సూచించారు. రైతులకు అవసరమైన పరిమాణంలో మాత్రమే ఎరువులు విక్రయించాలన్నారు. ఎరువుల కొనుగోలుకు వచ్చిన రైతులతో మాట్లాడిన కలెక్టర్, వారి సాగు చేసిన పంటలు, భూమి విస్తీర్ణం వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతులు నకిలీ విత్తనాలు, మందులు కొనకూడదని, ఎరువుల కృత్రిమ కొరత సృష్టించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఎరువులు, క్రిమిసంహారక మందులు భూసారానికి అనుగుణంగా వాడాలని, అధికంగా వాడితే దిగుబడిపై ప్రభావం ఉంటుందని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో జిల్లా వ్యవసాయ శాఖాధికారి అంజి ప్రసాద్, తహసీల్దార్లు రాజు, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

# పి హెచ్ సి నీ అకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

* కాలానుగుణ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి.
* జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్





నిర్మల్, జులై23 (సమయం న్యూస్) : వర్షాకాలంలో ఎక్కువగా వ్యాపించే కాలానుగుణ వ్యాధులపై వైద్యులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ సూచించారు. బుధవారం పట్టణంలోని బంగల్ పేట్ ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వర్షాల కారణంగా రోగుల సంఖ్య పెరిగే అవకాశముందని, అలాంటి పరిస్థితుల్లో వైద్యులు, సిబ్బంది సమయానికి విధులకు హాజరై, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. ఆసుపత్రి పర్యటన సందర్భంగా రోగుల నమోదు, రోగనిర్ధారణ పరీక్షలు, మందుల పంపిణీ వంటి అంశాలపై వైద్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రిజిస్టర్లను పరిశీలించి, వాటిని సమగ్రంగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. మందుల గదిని పరిశీలించి, అందుబాటులో ఉన్న ఔషధాల వివరాలు, గడువు తేదీలను తెలుసుకున్నారు. టీకాల గదిని తనిఖీ చేసారు. పారిశుధ్యం విషయంలో పటిష్ట చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆసుపత్రికి వచ్చిన రోగులతో మాట్లాడి వారి ఆరోగ్య స్థితి తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆసుపత్రులు ప్రైవేట్ హాస్పిటళ్లలు ధీటుగా అన్ని రకాల వైద్య సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని వారికి భరోసా ఇచ్చారు. ఈ తనిఖీలో జిల్లా వైద్యాధికారి డా. రాజేందర్, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# విద్యార్థులకు సబ్జెక్ట్ పై పట్టు సాధించేలా ఉపాధ్యాయులు బోధన చేయాలి

మహబూబాబాద్, జూలై23 (సమయం న్యూస్) : బుధవారం జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్, మహబూబాబాద్ జిల్లాలోని గూడూరు మండల కేంద్రంలోనీ కేజీబీవీ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థుల యొక్క అభ్యసన సామర్థ్యాలను స్వయంగా పరిశీలించారు, ప్రతీ సబ్జెక్టుపై పట్టు సాధించే విధంగా ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు బోధనలు కొనసాగించాలని ఆయన కోరారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ నిత్యం సానిటేషన్ నిర్వహించాలని సూచించారు, డైట్ మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారాన్ని అందించాలని సూచించారు, షెడ్యూల్ ప్రకారం విద్యార్థిని విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి ప్రతి విద్యార్థి యొక్క హెల్త్ ప్రొఫైల్ విధిగా మెయింటైన్ చేయాలని ఆదేశించారు. జిల్లాలోనీ ప్రత్యేక అధికారులు అందరూ వారికి కేటాయించిన అన్ని వసతి గృహాలను విధిగా తనిఖీ చేసి నివేదికల సమర్పించాలని ఆయన ఆదేశించారు.







# మెనూ పక్కాగా అమలు కావాల్సిందే

* కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి
* ప్రభుత్వ పాఠశాలలు, పీ.హెచ్ సీ, ఎరువుల గోడౌన్ తనిఖీ

నిజామాబాద్ జూలై 23 (సమయం న్యూస్) అన్ని ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలు, రెసిడెన్షియల్ స్కూళ్లలో కామన్ డైట్ మెనూ పక్కాగా అమలు చేయాలని కలెక్టర్ టి వినయ్ కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం నిర్దేశించిన విధంగా డైట్ ప్లాన్ ను అనుసరిస్తూ విద్యార్థులకు నాణ్యతతో కూడిన పౌష్టికాహారం అందించాలని సూచించారు. మోర్తాడ్ మండలం తిమ్మాపూర్ లో ఒకే ప్రాంగణంలో కొనసాగుతున్న ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రైమరీ స్కూళ్లను కలెక్టర్ బుధవారం ఆకస్మికంగా తనిఖీలు చేశారు. మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. డైట్ మెనూ ప్రకారం ఆహార పదార్థాలు లేకపోవడాన్ని గమనించిన కలెక్టర్, పాఠశాలల ప్రధానోపాధ్యాయులను ఈ విషయమై ప్రశ్నించారు. ప్రతీ రోజు డైట్ ప్లాన్ ప్రకారం పిల్లలకు భోజనం అందించేలా చూడాలని, పూర్తి స్థాయిలో మెనూ అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని హెచ్.ఎంలు సమ్మిరెడ్డి, నిజాముద్దీన్ లను ఆదేశించారు. అసంపూర్తిగా ఉన్న అదనపు తరగతి గదులను పరిశీలించి, పెండింగ్ లో ఉన్న తుది దశ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయించాలని ఇంజనీరింగ్ విభాగం అధికారులకు సూచించారు. పాఠశాలల్లో అన్ని మౌలిక వసతులు అందుబాటులో ఉండాలని, నాణ్యమైన విద్యా బోధన జరగాలన్నారు. అనంతరం కలెక్టర్ ఏర్గట్ల మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. మెడికల్ ఆఫీసర్, ఇతర సిబ్బంది హాజరును పరిశీలించారు. పీ.హెచ్.సీ నిర్వహణ, ప్రజలకు అందిస్తున్న వైద్య సేవల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజు సగటున ఎంతమంది రోగులు సందర్శిస్తారు, సరిపడా ఔషధాలు అందుబాటులో ఉన్నాయా అని ఆరా తీశారు. ఇమ్యూనైజేషన్, రక్త పరీక్షలు, టీ.బీ ముక్త్ భారత్ తదితర కార్యక్రమాల అమలు తీరు, పీ హెచ్ సీ పరిధిలో వైద్య శిబిరాల నిర్వహణ వివరాలు పరిశీలించారు. క్షయ వ్యాధి నిర్ధారణ అయిన వారికి స్వచ్ఛంద సంస్థలు, దాతల తోడ్పాటుతో పోషణ్ కిట్లు అందించేలా చొరవ చూపాలని అన్నారు. స్థానికంగా అందుబాటులో ఉంటూ, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని హితవు పలికారు. గర్భిణీ మహిళలకు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తూ, అవసరమైన వారికి తగు చికిత్సలు చేయాలని సూచించారు. వర్షాకాలం అయినందున సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. కాగా, ఏర్గట్ల సొసైటీ ఎరువుల గిడ్డంగిని సందర్శించిన కలెక్టర్, ఎరువుల స్టాక్ ను పరిశీలించారు. ఇప్పటివరకు ఈ వానాకాలం సీజన్ పంటలకు సంబంధించి రైతులకు పంపిణీ చేసిన ఎరువుల నిల్వల రికార్డులను తనిఖీ చేశారు. జిల్లాలో రైతుల అవసరాలకు సరిపడా యూరియా, ఇతర ఎరువులు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉన్నాయని, సజావుగా ఎరువులు పంపిణీ అయ్యేలా ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట ఏర్గట్ల మండల ప్రత్యేక అధికారి శివరామకృష్ణ, స్థానిక అధికారులు ఉన్నారు.

## సంపాదకీయం

# శేషప్రశ్నగా... ధన్‌ఖడ్ రాజీనామా వ్యవహారం!

పార్లమెంట్ సమావేశాలు ప్రారంభమైన తొలిరోజే.. అనూహ్యంగా భారత ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్ రాజీనామా చేయడం సహజంగానే ఆశ్చర్యాన్ని కలిగించడమే కాకుండా...అనుమానాలను రేకెత్తించింది. బెంగాల్ గవర్నర్‌గా ఆయన పనితీరును ప్రశంసించిన మోడీ అనూహ్యంగా ఆయనను ఉపరాష్ట్రపతి పదవికి ఎంపిక చేశారు. వెంకయ్యనాయుడు పదవీకాలం ముగియగానే పొడిగించమో లేదా.. రాష్ట్రపతిగా ప్రమోషన్ ఇవ్వడమో జరుగుతుందని అంతా అనుకున్నారు. అయితే అవేవీ జరగలేదు. మోడీ అధికారంలోకి వచ్చిన తరవాత అన్నీ అనూహ్యాలే జరుగుతున్నాయి. అద్వానీని రాష్ట్రపతిని చేస్తారని అంతా భావించారు. బిజెపి శ్రేణులు గట్టిగా నమ్మారు. కానీ రామ్‌నాథ్ కోవింద్‌ను తెరపైకి తెచ్చి అద్వానీని అవమానించారు. ఈ దేశానికి ప్రధాని కావాలని గట్టిగా నమ్మి పార్టీ కోసం కృషి చేసిన అద్వానీకి మోడీ అడ్డుపడ్డాడు. ఆతరవాత రాష్ట్రపతిని చేస్తారని అనుకుంటే...అప్పుడు కోవింద్ తెరపైకి వచ్చారు. ఇక అద్వానీ శకం ముగిసింది. మురళీమనోహార్ జోషి శకం ముగిసింది. పాతతరంలో రాజ్‌నాథ్ సింగ్, నితిన్ గడ్కరీలు మాత్రమే ఇప్పుడు మోడీ ప్రభుత్వంలో ఉన్నారు. వెంకయ్యనాయుడును పార్టీ నుంచి తప్పించే క్రమంలో ఉపరాష్ట్రపతిని చేసి, ఆ తరవాత ఆయనను ఇంటికే పరిమితం చేశారు. ఇప్పుడు ధన్‌ఖడ్ రాజీనామా కూడా అనూహ్యమే అయినా మోడీ వ్యూహం ఉండేవుంటుంది. పార్లమెంటు ప్రారంభంకావడం, తొలిరోజే అనూహ్యంగా విపక్షాలు వివిధ అంశాలపై చర్చకు పట్టుబట్టడం వంటి పరిణామాల నేపథ్యంలో ఎందుకు రాజీనామా చేశారన్న ప్రశ్న ఉదయిస్తోంది. అయితే రాష్ట్రపతి ద్రౌపది ముర్మ రాజీనామాను ఆమోదించారు. ఈ మేరకు ఫైల్‌పై సంతకం చేశారు. కాగా, గత రాత్రి అనూహ్యంగా జగదీప్ ధన్‌ఖర్ తన పదవికి రాజీనామా చేశారు. అనారోగ్య కారణాలతో పదవి నుంచి వైదొలుగుతున్నట్లు పేర్కొన్నారు. కానీ, ఈ రాజీనామాకు అసలు కారణం అనారోగ్యం కాదని పలువురు రాజకీయ నేతలు అంటున్నారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల వేళ ఉప రాష్ట్రపతి అనూహ్యంగా తన పదవికి రాజీనామా చేయడంఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీసింది. ఉపరాష్ట్రపతి రాజీనామాపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తొలిసారి స్పందించారు. ఉపరాష్ట్రపతి సహా వివిధ హోదాల్లో దేశానికి సేవ చేసేందుకు ధన్‌ఖడ్‌కు అనేక అవకాశాలు లభించాయ న్నారు. ఆయన మంచి ఆరోగ్యంతో ఉండాలని కోరుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వడం, వైద్యుల సలహాను పాటించడం కోసమే తాను ఉప రాష్ట్రపతి పదవికి రాజీనామా చేస్తున్నానని ధన్‌ఖడ్ తన రాజీనామా లేఖలో పేర్కొన్నారు. రాజ్యాంగంలోని 67(ఏ) అధికరణ కింద ఇది తక్షణమే అమలులోకి వస్తుందని తెలిపారు. ఈ మేరకు ఉపరాష్ట్రపతి కార్యాలయం ఈ లేఖను విడుదల చేసింది. తన బాధ్యతలను నిర్వర్తించడంలో పూర్తి సహకారాన్ని అందచేసిన రాష్ట్రపతి ద్రౌపది ముర్మకు, ప్రధాని నరేంద్ర మోదీకి, కేంద్ర మంత్రులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అయితే మరో రెండేండ్లు పదవీకాలం ఉండగానే ధన్‌ఖడ్ రాజీనామా చేయడం చర్చనీయాంశంగా మారింది. ఎందుకిలా అన్న చర్చ సాగుతోంది. 2022లో ఎన్డీయే తరపున ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా నామినేట్ కావడంతో ఆయన బెంగాల్ గవర్నర్ పదవికి రాజీనామా చేశారు.విపక్ష అభ్యర్థి మార్గరేట్ అల్వాపై విజయం సాధించి ఉపరాష్ట్రపతిగా ఎన్నికయ్యారు. 710 ఓట్లకుగాను 528 ఓట్లు గెలుచుకుని 1997 తర్వాత అత్యధిక ఓట్లతో ఉపరాష్ట్రపతిగా విజయం సాధించిన వ్యక్తిగా రికార్డు సృష్టించారు. ఉపరాష్ట్రపతి పదవికి రాజీనామా చేసిన మూడో వ్యక్తి ధన్‌ఖడ్. అంతకుముందు 1969లో రాష్ట్రపతి పదవికి పోటీ చేసేందుకు వీవీ గిరి, 1987లో రాష్ట్రపతిగా ఎన్నిక కావడంతో ఆర్ వెంకటరామన్ ఉప రాష్ట్రపతి పదవికి రాజీనామా చేశారు. కానీ అలాంటిదేమీ లేకుండానే ధన్‌ఖఢ్ రాజీనామా చేయడం ఢల్లీ రాజకీయాలలో ఆసక్తికరంగా మారింది. ఓ న్యాయమూర్తి నివాసంలో భారీగా నగదు లభించడం, కేంద్ర ప్రభుత్వంతో వివాదం, రాజ్యసభలో జరిగిన కొన్ని సంఘటనలు దన్‌కడ్ రాజీనామా వెనక ఉన్నాయని చెబుతున్నారు. ఈ నిర్ణయం ప్రస్తుతం దేశ రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. జస్టిస్ యశ్వంత్ వర్మ అనే న్యాయమూర్తి నివాసంలో భారీగా నగదు లభ్యం కావడంతో ఈ వివాదం మొదలైంది. ఈ సంఘటన తర్వాత విపక్ష పార్టీలు రాజ్యసభలో జస్టిస్ వర్మను తొలగించేందుకు ఒక నోటీసును ప్రవేశపెట్టాయి. రాజ్యసభ అధ్యక్షుడిగా ఉన్న జగదీప్ ధన్‌ఖర్ ఈ నోటీసును ఆమోదించి, రాజ్యసభ కార్యదర్శికి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ చర్య కేంద్ర ప్రభుత్వానికి నచ్చలేదని తెలుస్తోంది. విపక్షాలు ప్రవేశపెట్టిన ఈ నోటీసును ఆమోదించడం ద్వారా, న్యాయవ్యవస్థలో అవినీతిపై కేంద్రం నేరుగా చర్యలు తీసుకునే అవకాశాన్ని ధన్‌ఖర్ తప్పించారని కేంద్రం భావించినట్లు సమాచారం. ఈ విషయంపై కేంద్రంతో విభేదాలు వచ్చాయని పుకార్లు కూడా వచ్చాయి. ఈ సంఘటన తర్వాత ధన్‌ఖర్‌పై అవిశ్వాస తీర్మానం తీసుకొచ్చే ప్రయత్నాలు మొదల య్యాయని తెలిసింది. ఆరు నెలల క్రితం కూడా విపక్షాలు ధన్‌ఖర్‌పై అవిశ్వాస తీర్మానం తీసుకొచ్చాయి. అయితే, ఈసారి కేంద్రం నుంచి వచ్చిన ఒత్తిడి కారణంగా, ధన్‌ఖర్ అవమానకరమైన అవిశ్వాస తీర్మానానికి బదులు రాజీనామా చేయడాన్ని ఎంచుకున్నారని తెలుస్తోంది. ఈ క్రమంలో జరుగుతున్న పరిణామాలను దృష్టిలో పెట్టుకుని సోమవారం రాత్రి 9:25 గంటలకు ఉప రాష్ట్రపతి అధికారిక ఎక్స్ ఖాతాలో రాష్ట్రపతి ద్రౌపది ముర్మకు రాజీనామా లేఖను పోస్ట్ చేశారు. తన ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వడానికి, భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 67(ఎ) ప్రకారం రాజీనామా చేస్తున్నట్లు లేఖలో తెలిపారు. ఇది వెంటనే అమల్లోకి వచ్చేలా భారత ఉప రాష్ట్రపతి పదవికి రాజీనామా చేస్తున్నానని చెప్పారు. ఈ క్రమంలో తన పదవీ కాలంలో సహకరించిన వారికి ధన్‌ఖడ్ కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే, ప్రధానమంత్రి, రాజ్యసభ సభ్యులకు కూడా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అయితే ఇవన్నీ బయటకు కనిపిస్తున్న కారణాలే అయినా ఇంకా ఇతరత్రా ఏ కారణాలు ఉన్నాయన్నది కాలక్రమంలో తెలుస్తుంది. అయితే ధన్‌ఖడ్ మోడీకి ఇష్టమైన వ్యక్తిగా అనూహ్యంగా దూసుకుని వచ్చి..అంతే అనూహ్యంగా రాజీనామా చేసి వెళ్లిపోవడమనే చర్య మాత్రం అనుమానాలను రేకెత్తిస్తూనే ఉంటుంది.




తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ 200 కోట్ల ఉచిత ప్రయాణాలు చేసుకున్న సందర్భంగా వరంగల్ ఆర్టీసీ బస్టాండ్ లో ఏర్పాటు చేసిన సంబరాల్లో ముఖ్య అతిథిగా రాష్ట్ర అటవీ పర్యావరణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ హాజరై నగర మేయర్ గుండు సుధారాణి, జిల్లా కలెక్టర్ సత్య శారదా, జిడబ్ల్యూ ఎంసీ కమిషనర్ చాహత్ బాజ్ పాయి లతో కలసి కేక్ కట్ చేసి ఘనంగా సంబరాలు నిర్వహించారు. మహాలక్ష్మితో మహిళా సాధికారత పై నిర్వహించిన పోటీల్లో విజేతలకు ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ బహుమతులు అందజేశారు.

# లయన్స్ క్లబ్ సేవా కార్యక్రమాలు సద్వినియోగం చేసుకోండి

**: ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి**

నేరెడ్మెట్, జూలై 23: ఘనంగా లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ మల్కాజిగిరి 44వ ఇన్స్టాలేషన్ కార్యక్రమం లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ మల్కాజ్గిరి సంస్థ సేవలను అందరు సద్విని యోగం చేసుకోవాలని మల్కాజ్గిరి శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం బండ చెరువు సమీపం లోని లాల్ వాణి నగర్ గల లయన్స్ క్లబ్ భవనంలో లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ మల్కాజిగిరి 44వ ఇన్స్టాలేషన్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి మల్కాజ్గిరి శాసన సభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి, ఇన్స్టా లేషన్ అధికారి జగన్మోహన్ రెడ్డి, పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్లు A. లిం గారెడ్డి, రవీంద్రనాథ్ గుప్తా లు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రార్థించే పెదాల కన్నా సహాయం చేసే చేతులు మిన్న అన్నారు. లయన్స్ క్లబ్ భవనానికి తన సొంత నిధులతో ఒక విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ను ఏర్పాటు చేస్తానని లైన్స్ క్లబ్ ప్రతినిధులకు హామీ ఇచ్చారు. అనంతరం పేద మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్ పంపిణీ చేశారు. అనంతరం లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ మల్కాజ్గిరి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా దంతూరి సాంబశివరావు




ప్రధాన కార్యదర్శిగా మాశెట్టి శ్రీనివాస్ గుప్తా ట్రెజరర్ గా సురేందర్ రెడ్డిలు ఏకగ్రీవంగా నియమితులయ్యారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు కమలాకర్ ముత్యాల, మనోహార్ రెడ్డి, ఎస్వీవై రెడ్డి, పాండురంగారావు, దొంతి శ్రీనివాస్, వడ్డే సుబ్బారావు, బాలచందర్, బద్దం పరశురాం రెడ్డి, Brs నాయకులు జేఏసీ వెంకన్న, రాము యాదవులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే సంజీవ రెడ్డి, జిల్లా కలెక్టర్ రేషన్ కార్డుల పంపిణీ

పెద్ద శంకరం పేట జులై (సమయం న్యూస్) : రాష్ట్రంలోని ప్రతి ఒక్క నిరుపేద కుటుంబానికి తెల్ల రేషన్ కార్డు అందించాలన్న ఉద్దేశంతో ప్రజా ప్రభుత్వం నూతనంగా రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టిందని, రేషన్ కార్డు పేద కుటుంబాలకు ఎంతో కీలకమని నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి, జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. బుధవారం పెద్ద శంకరంపేట రైతు వేదికలో రేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియలో జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, మెదక్ ఆర్డీవో రమాదేవి, ఇతర అధికారులతో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలనలో ప్రజలకు ఒక్క రేషన్ కార్డు కూడా ఇచ్చిన పాపాన పోలేదని ప్రజా



ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన హామీలను ఒక్కొక్కటి నెరవేరుస్తూ అత్యంత నిరుపేదలకు రేషన్ కార్డులు మంజూరు ప్రక్రియ చేపట్టిందని ప్రభుత్వం చేసిన ఘనతగా పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ రేషన్ కార్డుల ప్రక్రియ నిరంతరంగా కొనసాగుతుందని మెదక్ జిల్లాలో 9,960 కొత్త రేషన్ కార్డులు మంజూరి చేస్తున్నామని, సుమారుగా 34 వేల కుటుంబాలు రేషన్ కార్డులో పేర్లు నమోదు చేయడం జరిగిందని, 45 వేల కుటుంబాలకు మెదక్ జిల్లా వ్యాప్తంగా రేషన్ కార్డుల ద్వారా లబ్ధి చేకూరుస్తున్నామన్నారు. గతంలో మీ సేవ ద్వారా దరఖాస్తు చేసుకుని రేషన్ కార్డు రాక ఇబ్బందులు పడ్డ వారిని కూడా గుర్తించి వారందరికీ అర్హత మేరకు రేషన్ కార్డులు మంజూరు చేస్తున్నామన్నారు. రేషన్ కార్డు ప్రక్రియ అనేది నిరంతరంగా కొనసాగుతుందని ఇంకా ఎవరైనా మిగిలిపోయిన వారు ఉంటే వారికి కూడా అందిస్తామన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ పెద్ద శంకరంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించి రోగులకు అందుతున్న వైద్య సేవలు గురించి ఆరా తీశారు. సిబ్బంది హాజరు పట్టిక, మందుల స్టాక్ రిజిస్టర్, ఓపి రిజిస్టర్ పరిశీలించి వైద్యశాల సమర్థ నిర్వహణకు తగు సూచనలు చేశారు. వ్యాధుల కాలాన్ని దృష్టిలో పెట్టుకుని అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కొత్త పరిశ్రమలు రావాలి.. యువతకు ఉపాధి దక్కాలి

- **ఇదే మా ప్రభుత్వ సంకల్పం, ఆ దిశగా చిత్తశుద్ధితో కృషి చేస్తున్నాం**
- **పారిశ్రామికవేత్తలకు అన్ని రకాలుగా అండగా ఉంటాం**
- **పారిశ్రామికాభివృద్ధిలో పరిశ్రమలను భాగస్వామ్యం చేస్తాం**
- **పారిశ్రామిక సంఘాల ప్రతినిధుల భేటీలో మంత్రి శ్రీధర్ బాబు**





హైదరాబాద్, జూలై23 (సమయం న్యూస్) : తెలంగాణకు కొత్త పరిశ్రమలు రావాలి. ఇక్కడి యువతకు ఉపాధి దక్కాలన్నదే సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం సంకల్పమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. బుధవారం డా. బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో సీఐఐ, ఫిక్కీ, ఎఫ్ టీసీసీఐ, ఎలీప్, టిఫ్, టాప్మా, టీఎస్ టీఎంఏ తదితర పారిశ్రామిక సంఘాల ప్రతినిధులతో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. 'తెలంగాణ పురోగతిలో భాగస్వామ్యమవుతున్న పారిశ్రామికవేత్తలకు అన్ని రకాలుగా అండగా ఉంటాం. చట్టాలు, నిబంధనల పేరిట వారిని ఇబ్బంది పెట్టాలనే ఉద్దేశం మాకు లేదు. రాష్ట్రంలోని ప్రతి పరిశ్రమను కాపాడుకుంటాం. ముఖ్యంగా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా ఉన్న ఎంఎస్ఎంఈ రంగానికి అండగా ఉంటాం. అలాగే... కార్మికుల ప్రయోజనా లను కాపాడుతాం' అని వివరించారు. 'గత ప్రభుత్వం మాదిరిగా ఏకపక్షంగా వ్యవహరించం. మాది అందర్నీ కలుపుకుని పోయే ప్రభుత్వం. రాష్ట్రాభివృద్ధి కోసం అందరి సలహాలు, సూచనలు స్వీకరిస్తాం. వాటిని ఆచరణలో పెడతాం. పారిశ్రామికాభివృద్ధికి మా ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఈ ప్రయాణంలో పరిశ్రమలను భాగస్వామ్యం చేయాలని నిర్ణయించాం. అందుకే... పలు పారిశ్రామిక సంఘాల ప్రతినిధులతో సమావేశమై రాబోయే రోజుల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై మేధో మథనం చేశాం' అని పేర్కొన్నారు. 'పారిశ్రామికాభివృద్ధిలో తెలంగాణ ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్ గా మారింది. ఏడాదిన్నర వ్యవధిలో సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రానికి కొత్తగా రూ.3 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులను తీసుకొచ్చాం. ప్రైవేట్ రంగంలో లక్ష మందికి పైగా ఉపాధి కల్పించాం. అయినా... రాష్ట్రం నుంచి పరిశ్రమలు తరలి వెళ్లిపోతున్నాయంటూ బీఆర్ఎస్, బీజేపీ మాపై దుష్ప్రచారం చేస్తుంది' అని కొత్తగా రాష్ట్రానికొచ్చిన పెట్టుబడుల గురించి సమావేశంలో పాల్గొన్న ప్రతి నిధులకు వివరించారు. రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధికి తీసుకుంటున్న చర్యలపై అవగాహన కల్పించారు. సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు. పరిశ్రమలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వీటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సమావేశంలో తెలంగాణ మినమం వేజెస్ అడ్వైజరీ బోర్డ్ ఛైర్మన్ బి.జనక్ ప్రసాద్, ఐటీ, పరిశ్రమల శాఖ స్పెషల్ సీఎస్ సంజయ్ కుమార్, కార్మిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిషోర్, పరిశ్రమల శాఖ డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి, పారిశ్రామిక సంఘాల ప్రతినిధులు సమీవుద్దీన్, రాజీవ్ వెంకటరమణ, రాంచంద్రారావు, శేఖర్ రెడ్డి, జయదేవ్, రాజీవ్, సుజాత, రమాదేవి, సుధీర్ రెడ్డి, సునీల్, గౌతమ్, అరుణ్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# అధిక వర్షపాతం కారణంగా బొగత జలపాత సందర్శన నిలిపివేత..

ములుగు జులై 23(సమయం న్యూస్): అటవీ ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ఈ నెల 26 వరకు బొగత జలపాతం సందర్శన నిలిపివేయడం జరుగుతుందని ములుగు DFO కిషన్ జాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే ముత్యందార, కొంగర, మామిడి లొద్ది, కృష్ణపురం జలపాతాలను ప్రయాణీకుల భద్రతాకారణాల దృష్ట్యా శాశ్వతంగా మూసివేయాలని నిర్ణయించినట్లు తెలిపారు.. ఎట్టి పరిస్థితుల్లో సందర్శకులు ఇటు వైపు వెళ్లవద్దని సూచించారు.. అటవీ అధికారులు హెచ్చరికలు బేఖాతరు చేసినవారిపై పోలీసు కేసును నమోదు చేస్తామని తెలిపారు..

epaper.samayamdaily.net
APTEL/2006/18267
సమయం
మన గొంతుకే.. మన పత్రిక
తెలుగు దినపత్రిక



# ఫతేనగర్‌లో కొత్త ఉద్భవ్ పాఠశాల క్యాంపస్‌ను ప్రారంభించిన చీఫ్ సెక్రటరీ, డిజిపిలు

హైదరాబాద్, జూలై 23(సమయం న్యూస్):ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్మెంట్, అహ్మదాబాద్ పూర్వ విద్యార్థుల సంఘం హైదరాబాద్ చారిటబుల్ ట్రస్ట్ (ఐఐఎం ఏ ఏ ఏ హెచ్సిటి) ఆధ్వర్యంలో పేద విద్యార్థుల కోసం హైదరాబాద్లోని ఫతేనగర్ పరిధిలోని శాస్త్రి నగర్లో ఉద్భవ్ పాఠశాలను చీఫ్ సెక్రటరీ శ్రీ కే.రామకృష్ణారావు, డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ డాక్టర్ జితేందర్ లు బుధవారం నాడు ప్రారంభించారు. ప్రతిష్టాత్మకమైన మేనేజ్మెంట్ కళాశాలలో ఒకటైన ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్మెంట్, అహ్మదాబాద్ లో చదువుకున్న పూర్వ విద్యార్థులైన రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ఎస్వి రమణమూర్తి, షణ్ముఖ, హరీష్ కుమార్, సీతారాం ,శ్రీ హర్షలు బోర్డు ట్రస్టీలుగా ఈ ఉద్భవ్ పాఠశాల ను ప్రారంభించారు. మురికివాడ ప్రాంతాల కు చెందిన బాల బాలికలకు విద్యను అందించాలని సదుద్దేశంతో ఈ పాఠశాల ద్వారా ఎల్కేజీ నుండి పదవ తరగతి వరకు నాణ్యమైన విద్యను భోధించనున్నారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ శ్రీ రామకృష్ణారావు మాట్లాడుతూ.... పేద విద్యార్థుల జీవితాలలో వెలుగు నింపేందుకు నెలకొల్పిన ఈ పాఠశాల విజయవంతంగా కొనసాగాలని అభి లాషించారు. ప్రజలకు అందించే ఉత్తమ సేవ విద్య అని అభివర్ణించారు. తాను సైతం ఈ రకమైన పాఠశాలలో విద్యను అభ్యసించానని, విద్యార్థులలో ఉన్న సామర్థ్యాన్ని వెలికి తీసి వారికి చక్కటి భవిష్యత్తు ఇవ్వాలని సూచించారు. పేద విద్యార్థులకు సహాయపడేందుకు తాను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానని తెలిపారు. డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ డాక్టర్ జితేందర్ మాట్లాడుతూ..... విద్యను అభ్యసించడానికి పేద గొప్ప తేడాను ఉండవని అందరిలోనూ ప్రతిభ ఉంటుందన్నారు. పురాణాలలో



చెప్పినట్లు హనుమంతుని బలం తనకు తెలియనట్టుగా... విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను ఉపాధ్యాయులు కనుగొని వారిని సరైన మార్గంలో నడిపించినట్లయితే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తును అందించవచ్చు అన్నారు. పేద విద్యార్థుల కోసం ఐఐఎంఏ పూర్వ విద్యార్థుల సంఘం నెలకొల్పిన ఉద్భవ పాఠశాల పేద విద్యార్థుల జీవితాలలో వెలుగు నింపుతుందన్నారు. ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అధ్యక్షులు శ్రీ ఆర్. రవి కుమార్ మాట్లాడుతూ....కొత్త ఫతేనగర్ క్యాంపస్ రసూల్‌పురా మరియు ఫతే నగర్ మురికివాడ ప్రాంతాల పిల్ల లకు ఆశాకిరణంగా నిలుస్తుందనీ అభిప్రాయపడ్డారు. నాణ్యమైన విద్యను బోధించడం ద్వారా పేద ప్రజల హృదయాలలో చిరస్థాయిగా నిలిచిపోతారని కొనియాడారు. శ్రీ శివ కుమార్ మాట్లాడుతూ.... ఈ క్యాంపస్ ప్రారంభంతో, తెలంగాణ రాష్ట్ర బోర్డు సిలబస్ ప్రకారం ఎల్కేజీ నుండి 10వ తరగతి వరకు విద్యార్థులకు సేవలందించనున్నామన్నారు.విలువలతో కూడిన విద్యను బోధించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఫండ్ రైజింగ్ కమిటీ చైర్మన్ టి. మురళీధరన్ ఉద్భవ్ పాఠశాలల విశిష్టతను తెలియజేశారు. ఉన్నత విద్య మరియు అర్థవంతమైన కెరీర్‌లను అందిస్తున్నాయన్నారు .కాగా, గతంలో నెలకొల్పిన ఉద్భవ పాఠశాలతో కలిపి ప్రస్తుతం1,086 మంది విద్యార్థులు, 55 మంది ఉపాధ్యాయులు, 3 ప్రధానోపాధ్యాయులు , 11 మంది సహాయక సిబ్బంది పనిచేస్తున్నారన్నారు. ఫతేనగర్ క్యాంపస్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో కోరమండల్, ఈవై, సిగ్నోడ్, ఆర్బిఎల్ బ్యాంక్, నా కూడా కెమికల్స్ ప్రతినిధులతో పాటు శాంత కుమారి, వీరేశ్వర్, రంగా కోట, తిరుమల రావులను చీఫ్ సెక్రటరీ, డిజిపిలు సన్మానించారు.



వరంగల్ తూర్పు నియోజకవర్గం మసూద్ గారి సోదరుడు వివాహ మహోత్సవంలో పాల్గొన్న గ్రేటర్ వరంగల్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజనాల శ్రీహరి.

# ఐదు గ్రామాలకు త్వరలో నక్షా మ్యాప్‌లు ఖరారు

* ఆ గ్రామాల్లో సర్వేమ్యాప్, భూధార్ అమలుకు యోచన
* రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



హైదరాబాద్ జూలై 23(సమయం న్యూస్) : దశాబ్దాలుగా రాష్ట్రంలో నక్షా లేని 413 గ్రామాలకు గాను ఐదు గ్రామాలలో ప్రయోగాత్మకంగా చేపట్టిన రీసర్వేను విజయవంతంగా పూర్తిచేశామని వీలైనంత త్వరితగతిన ఆ ఐదు గ్రామాల్లో సర్వే బౌండరీస్ యాక్ట్ ప్రకారం నక్షా మ్యాప్ నకు తుదిరూపునిస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. బుధవారం నాడు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సచివాలయంలోని తన కార్యాలయంలో రీసర్వేపై ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శి శేషాద్రి, రెవెన్యూ శాఖ కార్యదర్శి వి. లోకేష్ కుమార్, సర్వే ల్యాండ్‌సెటిల్ మెంట్ కార్యదర్శి రాజీవ్ గాంధీ హనుమంతుతో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి గారు మాట్లాడుతూ నిజాం కాలం నుంచి 413 గ్రామాలకు నక్షాలు లేవని గత ప్రభుత్వం పది సంవత్సరాలలో ఈ గ్రామాలను గాలికి వదిలేసిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నేతృత్వంలోని ఇందిరమ్మ ప్రభుత్వం దీనికి పరిష్కారం చూపాలన్న లక్ష్యంతో ప్రయోగాత్మకంగా మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ మండలం సలార్ నగర్, జగిత్యాల్ జిల్లా భీర్పూర్ మండలం కొమ్మనాపల్లి (కొత్తది) , ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం ములుగుమడ, ములుగు జిల్లా వెంకటాపురం మండలం నూగురు, సంగారెడ్డి జిల్లా వట్ పల్లి మండలం షాహిద్ నగర్ గ్రామాల్లో డ్రోన్ / ఏరియల్ మరియు ప్యూర్ గ్రౌండ్ ట్రూతింగ్ రోవర్ పద్ధతుల్లో సర్వే నిర్వహించామని తెలిపారు. నిబంధనల ప్రకారం భూ యజమానులకు నోటీసుల జారీ చేయడం, గ్రామ సభలు నిర్వహించి యజమానుల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకొని ప్రతి ఒక్కరి భూములకు సర్వే హద్దులను ఖరారు చేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ఈ ఐదు గ్రామాల్లో ఎదురైన అనుభవాలను దృష్టిలోపెట్టుకొని మిగిలిన గ్రామాల్లో కూడా రీసర్వే నిర్వహించడానికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజల మనోభావాలు, ఆలోచనలకు అనుగుణంగా వారు సంతృప్తి చెందేవిధంగా నక్షా మ్యాప్ ఉండాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వం ఏం చేసినా అంతిమంగా సామాన్య ప్రజలు, రైతుల సంతోషమే ప్రధానమన్నారు. భూములు అమ్మకం, కొనుగోలు సందర్భంలో హద్దులతో కూడిన సర్వే మ్యాప్ ను ఖచ్చితంగా జత పరచాలని అలాగే దేశంలో ప్రతి పౌరుడికి ఆధార్ నెంబర్ ఎలా ఉంటుందో భూములకు కూడా భూదార్ నెంబర్ కేటాయించాలని భూభారతి చట్టంలో స్పష్టం చేయడం జరిగిందని ఈ ఐదు గ్రామాలలో ఈ రెండు అంశాలను అమలు చేయాలన్న ఆలోచన చేస్తున్నామన్నారు. ఈ ఐదు గ్రామాలలో ఐదు గుంటలకు పైగా ఉన్నభూములకు కొత్తగా సర్వేనెంబర్లు ఇవ్వాలని, అలాగే రెవెన్యూ, ఫారెస్ట్, దేవాదాయ, వక్ఫ్ భూములు ఉంటే వాటి వివరాలను కూడా రికార్డులలో నమోదు చేయాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, సర్వే ల్యాండ్ సెటిల్‌మెంట్ జాయింట్ డైరెక్టర్ ప్రసన్న లక్ష్మి, ఐదు గ్రామాలకు చెందిన ఆర్డీవోలు, తహశీల్దార్లు, సర్వే ల్యాండ్ సెటిల్‌మెంట్ అసిస్టెంట్ డైరెక్టర్లు, సర్వే నిర్వహించిన ఏజన్సీల ప్రతినిధులు పాల్గొన్నారు.



## బొల్లారం మున్సిపాలిటీలో భువన్ సర్వే
## మున్సిపల్ కమీషనర్ కిషన్,స్పెషల్ ఆఫీసర్ చంద్రశేఖర్

పటాన్ చెరు(జిన్నారం), జూలై 23, సమయం న్యూస్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న 100 రోజుల ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా 52వ రోజు బొల్లారంలోని మునిసిపాలిటీ ప్రాంతంలోని వివిధ బార్డులలో భువన్ సర్వే నిర్వహించినట్లు మున్సిపల్ కమిషనర్ కిషన్ తెలియజేశారు. వందరోజుల కార్యక్రమానికి స్పెషల్ ఆఫీసర్ చంద్రశేఖర్, మున్సిపల్ కమిషనర్ బి కిషన్ మున్సిపల్ పరిధిలోని వివిధ వార్డులను సందర్శించి, వార్డులలో జరుగుతున్న పారిశుద్ధ పనులను పర్యవేక్షించారు. శిథిలావస్థలో ఉన్న భవనాలను, దారి పొడవున ఉన్నపిచ్చి మొక్కలను తొలగిస్తున్న పనులను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ ఎ ఇ, రెవెన్యూ ఆఫీసర్. మేనేజర్, బోర్డ్ ఆఫీసర్ మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# బడుగు, బలహీన వర్గాల, పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి

: రాష్ట్ర పశు సంవర్ధక,డైరీ అభివృద్ధి,మత్స్య,యువజన క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీ హరి
* దేవరకద్ర నియోజకవర్గంలోని చిన్న చింత కుంట,కౌకుంట్ల మండలాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రి వాకిటి శ్రీ హరి,దేవరకద్ర శాసన సభ్యులు జి.మధుసూధన్ రెడ్డి
* కౌకుంట్ల మండలం లో రేషన్ కార్డులు పంపిణీ చేసిన మంత్రి.
* దేవరకద్ర నియోజకవర్గం అభివృద్ధికి తన వంతు సహకారం

మహబూబ్ నగర్, జులై23 (సమయం న్యూస్) : బడుగు, బలహీన వర్గాలు, పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర పశు సంవర్ధక,డైరీ అభివృద్ధి, మత్స్య, యువజన క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీ హరి అన్నారు.బుధవారం దేవరకద్ర నియోజకవర్గంలోని చిన్న చింతకుంట, కౌకుంట్ల మండలాల్లో రాష్ట్రపశు సంవర్ధక,డైరీ అభివృద్ధి, మత్స్య, యువజన క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీ హరి సుమారు 7 కోట్ల రూ.ల అభివృద్ధి పనులకు శంకు స్థాపన,ప్రారంభం చేశారు.కౌకుంట్ల మండలం లో రేషన్ కార్డులు పంపిణీ కార్యక్రమం లో పాల్గొని రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్బంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేనప్పటికీ ఇచ్చిన మాట ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు.ఆరు వేల కోట్ల అప్పు ఉన్న రాష్ట్రం ను గత బి.ఆర్.ఎస్.ప్రభుత్వం 7 లక్షల కోట్లకు అప్పులు చేసి అప్పుల రాష్ట్రం గా చేసిందని అన్నారు. ఇందిరమ్మ ప్రభుత్వం పేదల ప్రభుత్వం అని,కిరాయికి, పెంకుటి ఇంట్లో ఉన్న పేదలకు ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణం చేస్తుందని అన్నారు. వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రి గా ఉమ్మడి రాష్ట్రం లో పేదలకు ఇందిరమ్మ ఇండ్లు,భూ పట్టాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. అర్హులైన పేదలకు రేషన్ కార్డులు పంపిణీ చేస్తుందని అన్నారు.ఇందిరమ్మ ఇండ్లు,రేషన్ కార్డుల పంపిణీ నిరంతర ప్రక్రియ అన్నారు. బి.ఆర్.ఎస్.ప్రభుత్వం మొదటి సారి లక్ష రుణ మాఫీ చేసిందని, రెండవ సారి విడతలు వారీగా రుణ మాఫీ వడ్డీ లు కట్టడానికి సరిపోలేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం 2 లక్షల లోపు రుణ మాఫీ చేసిందని అన్నారు. దేవరకద్ర నియోజక వర్గం లోనే 32 వేల 55 మందికి 246 కోట్ల రుణ మాఫీ చేసినట్లు తెలిపారు. వరి వేసుకుంటే ఉరి అని గత బి.ఆర్.ఎస్.ప్రభుత్వం లో చెప్పారని,కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు పండించిన వరి ధాన్యం ను మద్దతు ధరకు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేసిందని అన్నారు. సన్న రకం వడ్లకు క్వింటాల్ కి 500 రూ ల బోనస్ చొప్పున దేవరకద్ర నియోజకవర్గం లో 11425 మంది రైతులకు 37 కోట్ల రూ.లు బోనస్ చెల్లించిందని అన్నారు.నియోజకవర్గం లో 2359 కొత్త రేషన్ కార్డులు మంజూరు చేసినట్లు తెలిపారు. దేశంలో తెలంగాణ రాష్ట్రం లోనే ధనికులు తినే సన్న బియ్యం రేషన్ దుకాణాల ద్వారా పంపిణీ చేస్తుందని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి బి.సి.ల అభివృద్ధికి కులగణన చేసి బి. సి జనాభా నిర్ధారణ చేసినట్లు తెలిపారు. కౌకుంట్ల మండలం లో వెటర్నరీ ఆసుపత్రి మంజూరు చేస్తానని మంత్రి తెలిపారు. పత్తి రైతులకు ఉపయోగ పడేలా కౌకుంట్ల, ఇస్రాంపల్లి మధ్యలో బ్రిడ్జి నిర్మాణం కు సానుకూలంగా స్పందించారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయాలని ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి ద్వారా మహిళలకు 1000 బస్సులను కొనుగోలు చేసి ఆర్.టి. సి కి అద్దె ద్వారా మహిళా సంఘాలకు ఆదాయం సమకూరుస్తుందని అన్నారు. మహిళా సంఘాల ద్వారా పెట్రోల్ బంక్ లు, సోలార్ ప్లాంట్ లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్.టి. సి బస్ లలో 200 కోట్ల మంది జీరో టికెట్ తో ఉచిత ప్రయాణం చేసిన సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని డిపోల్లో సంబరాలు జరుపుకుంటున్నట్లు మంత్రి తెలిపారు. దేవరకద్ర నియోజక వర్గం ను అభివృద్ధి చేసేందుకు శాసన సభ్యులు జి.మధుసూదన్ రెడ్డి కి తన సంపూర్ణ సహకారం ఉంటుందని, మంత్రిగా తాను నిర్వహిస్తున్న 5 శాఖల పరిధిలో నియోజకవర్గం లో ఏ అవసరం ఉన్నా మంజూరు చేస్తానని అన్నారు. దేవరకద్ర శాసన సభ్యులు జి.మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ కౌకుంట్ల మండలం ను గత ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేసి రెండు సంవత్సరం లు అయినా కనీస సౌకర్యాలు కల్పించ లేదని అన్నారు. రెవెన్యూ కార్యాలయం,ఆసుపత్రి,ఎం.పి.డి. ఓ,పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయలేదని అన్నారు. తహశీల్దార్ కు సంవత్సరం జీతం ఇవ్వలేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ప్రతి నెల జీతం సంబంధిత అకౌంట్ లో జమ చేస్తున్నట్లు తెలిపారు.30 పడకల ఆసుపత్రిని ఈ రోజు శంకుస్థాపన చేసుకున్నట్లు,సంవత్సరం లోపు పూర్తి చేసి ప్రజలకు వైద్య సేవలు అందుబాటులోకి తీసుకు వస్తామని అన్నారు.పత్తి కొనుగోలు కేంద్రం ను ఏర్పాటుకు సంబంధిత మంత్రి తో మాట్లాడినట్లు వారం రోజుల్లో ప్రభుత్వం ద్వారా ఏర్పాటుకు మంజూరు వస్తుందని అన్నారు.పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేస్తామని అన్నారు. ముఖ్యమంత్రి తో మాట్లాడి జూనియర్ కళాశాల కౌకుంట్ల లో ఏర్పాటు చేస్తామని అన్నారు.






## కష్టాల్లో ఉన్న వారిని
## ఆదుకోవడం మానవతా ధర్మం

* సి.జి.ఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్ రెడ్డి

పటాన్ చెరు(గుమ్మడిదల),జూలై 23, సమయం న్యూస్ : కష్టాల్లో ఉన్న వారిని ఆదుకోవడం మానవతా ధర్మమని సి.జి. ఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్ రెడ్డి అన్నారు.సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలంలోని మంబాపూర్ గ్రామానికి చెందిన కంజర్ల సుదర్శన్ రోడ్డు ప్రమాదంలో, నీరుడు శ్రీనివాస్ అనారోగ్యంతో మరణించారు. ఈ కుటుంబాలను బుధవారం గోవర్ధన్ రెడ్డి పరామర్శించాడు. ఈ సందర్భంగా గోవర్ధన్ రెడ్డి మృతులకు కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. వారి కుటుంబాలను ఓదార్చి దుఃఖాన్ని తట్టుకునే ధైర్యాన్ని దేవుడు ఇవ్వాలని ఆకాంక్షించారు. ఆపదలో ఉన్న కుటుంబాలను ఆదుకోవడం మానవత ధర్మమని ఆయన అన్నారు. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబా లకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తానని ఆయన భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీనివాస్, నాయకులు ప్రకాష్, దయానంద్, లక్ష్మణ్, రాజు, వీరయ్య, వీరేష్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## గుమ్మడిదల ఎస్సైగా బాధ్యతలు
## స్వీకరించిన పెరుమళ్ళ లక్ష్మీకాంత్ రెడ్డి

పటాన్ చెరు(గుమ్మడిదల),జూలై 23, సమయం న్యూస్ : సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల ఎస్సైగా పెరుమళ్ళ లక్ష్మీకాంత్ రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు.గుమ్మడిదల పోలీస్ సిబ్బంది ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్ ఐ భరత్ భూషణ్ జోన్ VI చార్మినార్ కు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ఎస్సై లక్ష్మీ కాంత్ రెడ్డి మాట్లాడుతూ ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయని




ఆయన అన్నారు. ఈ ప్రాంతంలో శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా ఉండేందుకు అందరి సహాయ సహకారాలు కావాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో స్థానిక పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



## వీరశైవ లింగాయత్ పాదయాత్ర పోస్టర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే

పటాన్ చెరు, జూలై 23, సమయం న్యూస్ : వీరశైవ లింగాయత్ సమాజం పటాన్ చెరు ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం విశ్వశాంతి కై పటాన్ చెరు నుండి బొంతపల్లి వీరభద్ర స్వామి ఆలయం వరకు నిర్వహించే 18వ మహా పాదయాత్ర పోస్టర్ ను బుధవారం సాయంత్రం పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ విశ్వశాంతికై 18 సంవత్సరాలగా పాదయాత్ర నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇదే స్ఫూర్తితో ముందుకు కొనసాగాలని ఆయనకోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ కుంచాల ప్రభాకర్, వీరశైవ లింగాయత్ సంఘం ప్రతినిధులు,తదితరులు పాల్గొన్నారు.



## సీజనల్ వ్యాధులపై అవగాహన సదస్సు

పటాన్ చెరు (గుమ్మడిదల) జూలై 23, సమయం న్యూస్ : సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సీజనల్ వ్యాధులపై అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. ఈ సదస్సులో మున్సిపల్ కమిషనర్ దశరథం, డాక్టర్ ఎస్ మధుకర్,ఆసుపత్రి సిబ్బంది పాల్గొని, కాలానుగుణంగా వచ్చే వ్యాధుల నియంత్రణ పై వివిధ ప్రభుత్వ శాఖల అధికారుల మధ్య సమన్వయం కల్పించాలని సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో వ్యక్తిగత పరిసరాల పరిశుభ్రత, ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరికి తెలియజేయా లని సూచించారు. ఆగస్టు 10వ తేదీ నుండి అందరికీ ఔషధాల నిర్వహణ కార్యక్రమంలో ఆల్బెండజోల్, డి ఈ సి మాత్రలు ప్రతి ఒక్కరికి ఇవ్వడం జరుగుతుందని తెలియజేశారు. ఫైలేరియా నిర్మూలనలో ప్రతి ఒక్కరు భాగం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది, మున్సిపల్ ఈవో, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## కొడకంచిలో ఉచిత కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం

పటాన్ చెరు (జిన్నారం), జూలై 23, సమయం న్యూస్ : సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలంలోని ప్రపంచ గ్రామంలో గ్రామ స్వరాజ్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత కొట్టు శిక్షణ కేంద్రాన్ని బుధవారం కొడకంచి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం ప్రేమావతి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల మహిళల ఉపాధి కల్పనకు కృషి చేస్తున్న గ్రామ స్వరాజ్య సంస్థ నిర్వాహకులను అభినందించారు. 50 శాతం సబ్సిడీపై మహిళలకు కుట్టు మిషన్లు అందించడమే కాకుండా నెల రోజులపాటు ఉచితంగా శిక్షణ ఇవ్వడం ఎంతో గొప్ప విషయం అన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికెట్లను కూడా అందజేస్తారన్నారు. ఈ అవకాశాన్ని గ్రామీణ ప్రాంతాల మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో కేంద్రం శిక్షకురాలు సంధ్యారాణి, గ్రామ మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

# వరద నీరు నిల్వకుండా, ట్రాఫిక్ అంతరాయం కలగకుండా సత్వర చర్యలు చేపట్టాలి

* **నగరంలోని వరద ముప్పు ప్రాంతాల్లో కమిషనర్ క్షేత్ర పర్యటన, అధికారులకు సూచనలు**



హైదరాబాద్, జులై23 (సమయం న్యూస్) : గ్రేటర్ హైదరాబాద్ నగరంలో వర్షపు నీరు నిలుస్తూ తరచూ ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్న ప్రాంతాలను గుర్తించి వెంటనే క్లియర్ చేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్ శ్రీ ఆర్.వి. కర్ణన్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం జీహెచ్ఎంసీ కమిషనర్ శ్రీ ఆర్.వి. కర్ణన్, హైడ్రా కమీషనర్ రంగ నాథ్ ,ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ శ్రీ గజరావు భూపాల్, జోనల్ కమిషనర్ (సెరిలింగంపల్లి జోన్) శ్రీ భోర్ఖడే హేమంత్ సహదేవరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సిబ్బందితో కలిసి సెరిలింగంపల్లి జోన్ లో క్షేత్ర పరిశీలన చేశారు. ఈ సందర్భంగా కమీషనర్ మెడికవర్ హాస్పిటల్ సమీపంలోని జూబ్లీ ఎన్క్లేవ్ కమాన్ వద్ద వరద నీటి డ్రైనేజీని కమిషనర్ పరిశీలించారు. ఆ తర్వాత, శిల్పరామం ఎదురుగా ఉన్న తమ్మిడికుంట లేక్స్ ఔట్ లెట్ పాయింట్ ను సందర్శించారు. తదుపరి, హైటెక్ సిటీలోని యశోద హాస్పిటల్ రోడ్డుపై స్మైలైన్ డెంటల్ వద్ద నీటి నిల్వ పాయింట్ ను పరిశీలించారు. స్మైలైన్ డెంటల్ హాస్పిటల్ వద్ద యశోద రోడ్డుపై తుఫాను నీటి డ్రైన్ నిర్మించాలని, తమ్మిడికుంట సరస్సు వద్ద హైడ్రా చేత పడవేయబడిన వ్యర్థాలను తొలగించాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. వర్షం పడినప్పుడు వరదతో పాటు పెద్దమొత్తంలో చేరుతున్న సిల్ట్ ను వెనువెంటనే తొలగించాలని అధికారులు ఆదేశించారు. అనునిత్యం అప్రమత్తంగా ఉండి వరద నివారణతో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు.

# ప్రతిభావంతులైన విద్యార్థులకు తోడ్పాటు : జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

* **4,30,800 రూపాయల విలువగల ఆర్చరీ కాంపౌండ్ బో పంపిణీ**
* **ఆర్చరీ క్రీడాకారుడికి కాంపౌండ్ బో అందజేసిన జిల్లా కలెక్టర్**



పెద్దపల్లి, జూలై23: (సమయం న్యూస్) : జిల్లాలో క్రీడలకు సంబంధించి ప్రతిభావంతులైన విద్యార్థిని విద్యార్థులకు అవసరమైన తోడ్పాటు అందించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో తన చాంబర్ లో ప్రతిభా వంతుడైన ఆర్చరీ క్రీడాకారుడు తానిపర్తి యశ్వంత్ కు 4,30,800 రూపాయల విలువ గల అంతర్జాతీయ స్టాండర్డ్ తో కూడిన కాంపౌండ్ బో పంపిణీ చేశారు. ఎలిగేడు మండలం సుల్తాన్ పూర్ గ్రామానికి చెందిన దానిపర్తి యశ్వంత్ ఆర్చరీలో పోటీలలో పాల్గొనేందుకు తనకు కాంపౌండ్ బో కావాలని జిల్లా కలెక్టర్ కు దరఖాస్తు చేసుకోవడం జరిగింది. విద్యార్థి దరఖాస్తు పరిశీలించిన జిల్లా కలెక్టర్ 4 లక్షల 30 వేల 800 రూపాయలను మంజూరు చేస్తూ విద్యార్థినికి అవసరమైన కాంపౌండ్ బో కొనుగోలు చేసి నేడు పంపిణీ చేశారు. విద్యార్థి భవిష్యత్తులో ఆర్చరీ లో గొప్ప క్రీడాకారుడుగా ఎదగాలని, జాతీయ అంతర్జాతీయ స్థాయి పోటీలలో రాణించాలని తద్వారా పెద్దపల్లి జిల్లాకు మంచి పేరు తీసుకుని రావాలని అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు తోడ్పాటు జిల్లా యంత్రాంగం తరపున అందిస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి సురేష్, కుమార్, శ్రీనివాస్, తదితరులు పాల్గోన్నారు.

# మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం ఒక వరం

* **ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు..**



భూపాల పల్లి. జులై 23(సమయం న్యూస్) : మహిళలకు మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణం వరమని భూపాలపల్లి శాసన సభ్యులు గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు. బుధవారం సాయంత్రం భూపాలపల్లి బస్టాండ్ లో డిపో మేనేజర్ ఇందూ అధ్యక్షతన నిర్వహించిన మహాలక్ష్మి పథకం సంబురాల్లో ముఖ్య అతిథిగా భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఏర్పడిన ప్రజాపాలన ప్రభుత్వం అమలు చేసిన మొట్టమొదటి పథకం మహాలక్ష్మి పథకమని ఎమ్మెల్యే అన్నారు. ఆర్టీసీ బస్సులల్లో ఇప్పటి వరకు మహిళలకు 200 కోట్ల జీరో టికెట్లు జారీ చేశామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా మహిళల ఉచిత బస్సు ప్రయాణ విలువ రూ.6700 కోట్లుగా నమోదైందని అన్నారు. ప్రజా ప్రభుత్వం ఉచిత బస్సు పథకం కోసం ఎప్పటికప్పుడు ఆర్టీసీకి నిధులు విడుదల చేస్తోందన్నారు. ఒక్క మన భూపాలపల్లి డిపోలోనే 1,44,72,000 మంది మహిళలు ఉచిత బస్సు ప్రయాణం చేశారని, ఆర్టీసీకి మహాలక్ష్మీ ఆదాయం రూ.73,83,43,000 రూపాయలు వచ్చినట్లు తెలిపారు. మహిళలకు ప్రయాణ భద్రత, ఆర్థిక భారం తగ్గించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణ పథకం ఎంతో ప్రయోజనకరంగా మారిందని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం తీసుకున్న ఈ ససోతోపేతమైన చొరవ వల్ల మహిళలు ఉచిత ప్రయాణం చేస్తూ చార్జీల డబ్బులు కుటుంబ అవసరాలకు ఉపయోగిస్తున్నారని, దీని వల్ల ఆర్థిక భారం తగ్గిందన్నారు. ఉచిత ప్రయాణం వల్ల అవసరమైన ప్రదేశాలకు ఒక్క.రూపాయి ఖర్చు లేకుండా ప్రయాణిస్తున్నారన్నారు. ఇది రాష్ట్ర ప్రభుత్వం మహిళా సాధికారత దిశగా తీసుకున్న కీలకమైన అడుగు అని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా మహిళలకు శుభాకాంక్షలు తెలుపుతూ మహాలక్ష్మి బస్సుతో మీ ప్రయాణం ఆనందదాయకంగా ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం భూపాలపల్లి నుండి దూదేకులపల్లి గ్రామానికి వయా కమలాపూర్, రాంపూర్, గొల్లబుద్దారం మీదుగా బస్సు సర్వీసును ఆర్టీసీ డీఎంతో కలిసి ప్రారంభించారు. అనంతరం బస్సులో బాంబులగడ్డ వరకు ఆర్టీసీ డీఎం ఇందూ, జిల్లా ఆర్టీఐ మెంబర్ సుంకరి రామచంద్రయ్య, భూపాలపల్లి డీఎస్పీ సంపత్ రావు, సీఐ నరేష్ తో కలిసి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ప్రయాణం చేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు, ప్రజాప్రతినిధులు, మహిళా ప్రయాణికులు, తదితరులు పాల్గొన్నారు.



# విద్యా, వైద్యంపై ప్రత్యేక దృష్టి..

* **జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**

రేగొండ జులై 23(సమయం న్యూస్): బుధవారం రేగొండ మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతి బా పూలే గురుకుల పాఠశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మొదట మహాత్మా జ్యోతి బా పూలే గురుకుల పాఠశాలలో కిచెన్ షెడ్, స్టోర్ రూమ్, క్లాస్ రూములను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. విద్యార్థులకు వ్యక్తిగత శుభ్రతపై అవగాహన కల్పించాలని తెలిపారు. వంటకు ఉపయోగించే కూరగాయలు, పప్పులు,మాంసం నాణ్యత పాటించాలని అన్నారు. ఏదేనిన సమస్య ఏర్పడితే వెంటనేపై అధికారులకు సమాచారం అందించాలని విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గురుకుల పాఠశాలలో కూరగాయలు నిల్వ ఉంచడానికి ప్రత్యేక ర్యాక్ లు అందిస్తామని జిల్లా కలెక్టర్ తెలిపారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి రోగుల హాజరు నమోదు రిజిస్టర్, ఎలాంటి జబ్బులతో ఆసుపత్రికి వస్తున్నారు అని అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యసేవలందిస్తేనే ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజలకు నమ్మకం పెరుగుతుందని అన్నారు. ఆసుపత్రి ల్యాబ్, ఫార్మసీ, ఇన్ పేషెంట్ వార్డులను పరిశీలించి సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యా లాంటి వ్యాధులు బారిన పడిన వారి వివరాలు వెంటనేపై అధికారులకు తెలుపాలని సూచించారు. గ్రామాలలో ప్రజలకు సీజనల్ వ్యాధుల నియంత్రణకు తీసుకోవాల్సి న ముదస్తు జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. వ్యాధులు. ప్రబలిన ప్రాంతాల్లో మెడికల్ క్యాంపులు నిర్వహించి తగు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అన్ని ఆసుపత్రుల్లో అవసరమైన వ్యాక్సిన్లు, మందులు అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు.. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి సునీల్ కుమార్, ఇంచార్జి డిఎంహెచ్ఓ డా శ్రీదేవి, ఆసుపత్రి వైద్యులు డా హిమబిందు, తహసిల్దార్ శ్వేత, ఎంపీడీవో వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఆసుపత్రికి వచ్చే రోగుల పట్ల మర్యాదగా ప్రవర్తించాలి

* **అత్యవసర విభాగంలో సిబ్బంది అందుబాటులో ఉండాలి...**
* **సాధారణ ప్రసవాలపై అవగాహన కల్పించాలి...**

సూర్యాపేట, జులై23 (సమయం న్యూస్) : ప్రభుత్వ ఆసుపత్రి కి వచ్చే రోగులపట్ల సిబ్బంది మర్యాదగా వ్యహరించాలని, వారు ఏ విభాగానికి వెళ్లాలో తెలియజేసే విధంగా సిబ్బంది చెప్పెవిదంగా ఉండేలా చూడాలని జిల్లా కలెక్టర్ నర్సింగ్ సూపర్డెంట్ రేణుక భాయ్ కి తెలిపారు. బుధవారం మధ్యాహ్నం సూర్యాపేట పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి లో గల మాత శిశు ఆరోగ్య కేంద్రం ను కలెక్టర్ పరిశీలించారు. వివిధ విభాగాలకు సంబంధించిన గదులను పరిశీలించారు. రోజుకి ఎంతమంది గర్భిణీ స్త్రీలు వస్తున్నారు, వారిని రిజిస్టర్లో నమోదు చేస్తున్నారా లేదా పరిశీలించారు. ఆసుపత్రి లో పరిశుభ్రత పాటించాలని కలెక్టర్ తెలిపారు గర్భిణీ స్త్రీ తో పాటు వచ్చే అటెండెంటుకు అన్ని సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. గర్భిణీ స్త్రీలకు మెడికల్ సర్వీసెస్ చాలా బాగున్నాయని కానీ ఎం సి హెచ్ సిబ్బంది పేషెంట్ల పట్ల అమర్యాదగా వ్యవహరిస్తున్నారని తన దృష్టికి వచ్చిందని కలెక్టర్ పేర్కొన్నారు. ఇకపై ఇలాంటి సంఘటనలు అయితే అట్టి వారిపై కఠిన చర్యలు తీసుకోబడతాయని మాతా శిశు ఆరోగ్య కేంద్రాన్ని సిబ్బందిని హెచ్వోడి వీరేక్షించాలని కలెక్టర్ తెలిపారు. మాత శిశు ఆరోగ్య కేంద్రానికి గర్భిణీ స్త్రీలను పరిశీలన నిమిత్తం తీసుకొని వచ్చిన గిరి నగర్ చెందిన ఆశాలు పారిజాతం, ఆదిలక్ష్మితో కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. మొత్తం నలుగురు గర్భిణీలను పరిశీలన నిమిత్తమై తీసుకొని రావడం జరిగిందని



వారు పేర్కొన్నారు. అమ్మ పాలన సహాయ కేంద్రం వద్ద గర్భిణీల నమోదు రిజిస్టర్ను పరిశీలించారు. మఠంపల్లి మండలానికి చెందిన బక్కపల్లి గ్రామవాసి బచ్చలకూర రూప మూడవ డెలివరీ కోసం ఆసుపత్రికి రావడం జరిగిందని ఇక్కడ సిబ్బంది సేవలు చాలా బాగున్నాయని కలెక్టర్కు వివరించారు. అనంతరం గర్భిణీలవార్డును పరిశీలించారు. అక్కడ చెరుకుపల్లి గ్రామాన్నించి వచ్చిన రమాదేవి కి సాధారణ ప్రసవం జరిగిందని బాబు పుట్టాడని సంతోషంగా కలెక్టర్కు తెలిపింది. రేపాల పిహెచ్ సి నుంచి మేక అనిత ఏడో నెల గర్భవతి జనరల్ చెకప్ కు తీసుకుని వచ్చిన ఆశలతో కలెక్టర్ మాట్లాడారు. గర్భిణీలను జనరల్ చెకప్ కు తీసుకువచ్చి ఆశాలకు అన్ని సదుపాయాల ఉన్న ఒక విశ్రాంతి గది కేటాయించాలని హెచ్ ఓ డి కి కలెక్టర్ తెలిపారు. పేషంట్లతో వచ్చిన సహాయకులకు విశ్రాంతి కొరకు తాత్కాలిక షెడ్డు నిర్మించాలని ఇంజనీరింగ్ అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ ప్రధాన ఆసుపత్రిలోని అత్యవసర విభాగాన్ని పరిశీలించారు. ఈ విభాగంలోని సిబ్బంది ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని కలెక్టర్ తెలిపారు. అనంతరం క్రిటికల్ కేర్ యూనిట్ ను పరిశీలించారు.

epaper.samayamdaily.net APTEL/2006/18267

# యాదగిరిగుట్ట 41 రోజుల ఆదాయం ఎంతంటే? 12 దేశాల కరెన్సీలు సమర్పించిన భక్తులు

* నగదు, కానుకలను లెక్కించిన ఆలయ సిబ్బంది
* రూ. 2,45,48,023 నగదు సమకూరినట్లు వెల్లడించిన ఈవో
* స్వామి వారికి బంగారం, వెండి సమర్పించిన భక్తులు



యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో హుండీ ఆదాయాన్ని లెక్కించారు. గత 41 రోజులుగా భక్తులు సమర్పించిన నగదు, నగల కానుకలను బుధవారం ఆలయ సిబ్బంది లెక్కించారు. రూ. 2,45,48,023 నగదు సమకూరినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి వెంకట్రావు వెల్లడించారు. దీంతో పాటు 38 గ్రాముల బంగారం, 2,800 గ్రాముల వెండి, వివిధ దేశాల కరెన్సీలు హుండీ ఆదాయం ద్వారా సమకూరినట్లు తెలిపారు. విదేశీ కరెన్సీ విషయానికి వస్తే అమెరికా 1036 డాలర్లు, ఆస్ట్రేలియా 5 డాలర్లు, ఇంగ్లండ్ 45 పౌండ్లు, సౌదీ అరేబియా 5 రియాల్, సింగపూర్ 10 డాలర్లు, మలేసియా 23 రింగిట్స్, కెనడా 20 డాలర్లు, ఒమన్ 500 బైస, అరబ్ ఎమిరేట్స్ 70 ధీరమ్స్‌తో సహా 12 దేశాల కరెన్సీలు లక్ష్మీనరసింహస్వామి వారికి సమర్పించారు.

## తెలంగాణలో ఆరుగురు ఐఏఎస్ లకు సబ్ కలెక్టర్లుగా పోస్టింగ్

* 2023 బ్యాచ్ ఐఏఎస్ అధికారులకు పోస్టింగ్
* ఆరుగురికి సబ్ కలెక్టర్లుగా పోస్టింగ్ ఇస్తూ ఉత్తర్వులు
* నారాయణఖేడ్ సబ్ కలెక్టర్‌గా ఉమాహారతి




తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 2023 బ్యాచ్ ఐఏఎస్ అధికారులకు సబ్ కలెక్టర్లుగా పోస్టింగ్ ఇస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. ఆరుగురు ఐఏఎస్ అధికారులకు సబ్ కలెక్టర్లుగా పోస్టింగ్ ఇచ్చారు. నారాయణఖేడ్ సబ్ కలెక్టర్‌గా ఉమాహారతి, భైంసాకు అజ్మీరా సంకేత్ కుమార్, ఆర్మూర్‌కు అభిజ్ఞాన్ మాల్వియా, కల్లూరుకు అజయ్ యాదవ్, భద్రాచలానికి మృణాళ్ శ్రేష్ఠ, బెల్లంపల్లి సబ్ కలెక్టర్‌గా మనోజ్‌ను నియమిస్తూ సీఎస్ రామకృష్ణరావు ఉత్తర్వులు జారీ చేశారు.

## కంచగచ్చిబౌలిలో చెట్ల నరికివేతపై మరోసారి సంచలన వ్యాఖ్యలు చేసిన సుప్రీంకోర్టు

* నరికిన చెట్ల స్థానంలో మొక్కలు పెంచాలన్న కోర్టు
* పర్యావరణ పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని ఆదేశం
* నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే అధికారులను జైలుకు పంపిస్తామని హెచ్చరిక



కంచగచ్చిబౌలిలో చెట్ల నరికివేతపై సుప్రీంకోర్టు ఈరోజు మరోసారి సంచలన వ్యాఖ్యలు చేసింది. నరికిన చెట్ల స్థానంలో మొక్కలు నాటి పర్యావరణాన్ని పునరుద్ధరించాలని అధికారులకు సూచించింది. లేదంటే అధికారులను జైలుకు పంపిస్తామని మరోమారు హెచ్చరించింది. ఈ మేరకు హెచ్ సీయూ సమీపంలోని కంచగచ్చిబౌలి భూముల వివాదంపై సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ జరిపింది. ఈ భూమిలో పర్యావరణ పునరుద్ధరణకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం మంగళవారం దాఖలు చేసిన అఫిడవిట్ ను ధర్మాసనం పరిశీలించింది. గత విచారణలో ధర్మాసనం ఇచ్చిన ఆదేశాలకు అనుగుణంగా చర్యలు చేపట్టినట్లు తెలిపింది. కంచగచ్చిబౌలి భూముల్లో పనులు నిలిపివేసి పర్యావరణ పునరుద్ధరణకు కృషి చేస్తున్నట్లు అఫిడవిట్ లో పేర్కొంది. ప్రభుత్వం దాఖలు చేసిన అఫిడవిట్ ను పరిశీలించడానికి సమయం కావాలని అమికస్ క్యూరీ కోరడంతో సుప్రీం ధర్మాసనం విచారణను ఆగస్టు 13కు వాయిదా వేసింది. కంచగచ్చిబౌలిలోని 400 ఎకరాల భూమిలో చెట్ల నరికివేతపై సుప్రీంకోర్టు సుమోటో విచారణ చేపట్టిన విషయం తెలిసిందే. గత విచారణలో సీజేఐ నేతృత్వంలోని సుప్రీం ధర్మాసనం అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. చెట్ల నరికివేతను వెంటనే నిలిపివేసి, నరికిన చెట్ల స్థానంలో మొక్కల పెంపకం చేపట్టాలని ఆదేశించింది. ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సహా ఉన్నతాధికారులంతా జైలుకు వెళ్లాల్సి ఉంటుందని తీవ్రంగా హెచ్చరించింది. కంచగచ్చిబౌలి అటవీ ప్రాంతంలోనే ప్రత్యేకంగా జైలు నిర్మించి అధికారులను అందులోనే ఖైదు చేయాలని పోలీస్ శాఖను ఆదేశిస్తామని వ్యాఖ్యానించింది. పర్యావరణ పునరుద్ధరణకు చర్యలు చేపట్టి, పర్యావరణానికి జరిగిన నష్టాన్ని పూడ్చేందుకు తీసుకున్న చర్యలను కోర్టుకు తెలియజేయాలంటూ విచారణను వాయిదా వేసింది. తాజాగా ఈరోజు కంచగచ్చిబౌలి భూముల కేసును విచారించింది.



## బొగత జలపాతం మూసివేత.. అటవీశాఖ నిర్ణయం

హైదరాబాద్: ములుగు జిల్లాలోని వాజేడులో కుండపోత వర్షాలతో బొగత జలపాతం పరవళ్లు తొక్కుతోంది. ఈ నేపథ్యంలో పర్యటకుల భద్రత దృష్ట్యా ఈ జలపాతాన్ని తాత్కాలికంగా మూసివేయాలని తెలంగాణ అటవీశాఖ నిర్ణయించింది. ఈ నెల 26 వరకు రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. తదుపరి ఆదేశాలు జారీ చేసేవరకు ఈ జలపాతం మూసిఉంటుందని ములుగు జిల్లా ఫారెస్ట్ అధికారి ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ జలపాతం ఉప్పొంగి ప్రవహిస్తుండటంతో ఇప్పటికే అప్రమత్తమైన అధికారులు.. హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. సందర్శకులను అనుమతించడంలేదు. మరోవైపు, ముత్యందార, కొంగల, మామిడిలొద్ది, కృష్ణాపురం జలపాతాలను సైతం శాశ్వతంగా మూసివేస్తున్నట్లు ప్రకటించారు. పర్యటకులను ఆయా జలపాతాల వద్దకు అనుమతించబోమని తెలిపారు. ఎవరైనా తమ సూచలను ఉల్లంఘిస్తే కఠినంగా వ్యవహరిస్తామని, పోలీసు కేసు నమోదు చేస్తామని అధికారులు హెచ్చరించారు.

## సాధ్యం కానప్పుడు.. రిజర్వేషన్ బిల్లును అసెంబ్లీలో ఎలా అంగీకరించారు?

: మహేశ్‌కుమార్ గౌడ్



హైదరాబాద్: భాజపా, భారత రాష్ట్ర సమితి పార్టీలు బీసీలకు వ్యతిరేకమని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ తీసుకొచ్చేందుకు చేస్తోన్న ప్రయత్నాలకు భారత రాష్ట్ర సమితి మోకాలడ్డుతోందని విమర్శించారు. బుధవారం మీడియాతో ఆయన మాట్లాడారు. తాము పంపిన బీసీ రిజర్వేషన్ల బిల్లును రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చేందుకు భాజపా ససేమిరా అంటోందని.. 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వడం ఆ పార్టీకి ఇష్టం లేనట్లుగా ఉందన్నారు. ''బీసీ రిజర్వేషన్ల బిల్లును 9వ షెడ్యూల్‌లో చేర్చడం ఎందుకు సాధ్యం కాదు? అలాంటప్పుడు అసెంబ్లీలో భాజపా ఎమ్మెల్యేలు ఎందుకు అంగీకరించారు? బిల్లు ప్రతిపాదన దిల్లీకి చేరేసరికి ఎందుకు మాట మారుస్తున్నారు? భాజపా జాతీయ నాయకత్వం.. తమ అభిప్రాయాన్ని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడి నోటితో పలికిస్తూ పలాయనం చిత్తగిస్తోంది. బీసీ బిల్లు కోసం పార్లమెంట్‌ను స్తంభింపజేస్తాం. ఈ నెల 25న జరగనున్న ఓబీసీల సదస్సులో రాహుల్ గాంధీ బీసీ గొంతుకై నిలవబోతున్నారు. బీసీ వ్యతిరేక పార్టీలైన భాజపా, భారత రాష్ట్ర సమితి నుంచి బీసీలంతా బయటకు రావాలి''అని మహేశ్‌కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు.

## డబుల్‌బెడ్ రూమ్ ఇళ్లు ఇప్పిస్తానని మోసం.. వ్యక్తి అరెస్టు

హైదరాబాద్: డబుల్‌బెడ్ రూమ్ ఇళ్లు ఇప్పిస్తానని డబ్బులు వసూలు చేసిన ఓ వ్యక్తిని జీడిమెట్ల పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడు హరిబాబు గతంలో కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద క్యాంప్ ఆఫీసులో అసిస్టెంట్‌గా పనిచేశాడు. ప్రభుత్వ గృహనిర్మాణ పథకం కింద డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు ఇప్పిస్తానని గిరినగర్‌కు చెందిన రమేశ్ వద్ద రూ.లక్ష నగదు తీసుకున్నాడు. ఇల్లు ఇప్పించకపోగా.. డబ్బులు తిరిగి ఇవ్వకుండా మోసం చేశాడు. ఇదే విధంగా దాదాపు 83 మంది వద్ద కూడా రూ.లక్ష చొప్పున తీసుకొని మోసం చేశాడని పోలీసులకు రమేశ్ ఫిర్యాదు చేశాడు. వసూలు చేసిన డబ్బుతో హరిబాబు కుత్బుల్లాపూర్‌లోని రెడ్డినగర్ కాలనీలో ఇల్లు నిర్మించుకొని ప్రస్తుతం అక్కడే నివసిస్తున్నట్లు పేర్కొన్నాడు. రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. దర్యాప్తు చేపట్టారు.



ఎనిమిది మంది బాధితుల వాంగ్మూలాలను నమోదు చేసి, వీడియో ఆధారాలను సేకరించారు. వాటిలో ఒక బాధితుడు హరిబాబుకు డబ్బులు అందజేసే దృశ్యాలు కూడా ఉన్నాయి. దీంతో పోలీసులు నిందితుడిని బుధవారం అరెస్టు చేశారు. మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు.

## రూ.69లక్షల విలువైన డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నాం: సీపీ సీవీ ఆనంద్



హైదరాబాద్: నగరంలో డ్రగ్స్ విక్రయిస్తున్న 9 మందిని హైదరాబాద్ నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ (హెచ్‌న్యూ) పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. కొకైన్ సరఫరా చేస్తున్న ఆరుగురు, మెఫిడ్రీన్ సరఫరా చేస్తున్న ముగ్గురిని అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి 286 గ్రాముల కొకైన్, 11 గ్రాముల ఎక్స్‌టసీ, తుపాకీ, 12 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఈ కేసు వివరాలను సీపీ సీవీ ఆనంద్ వెల్లడించారు. ''డగ్స్ కేసులో రవివర్మ, సచిన్ అనే ఇద్దరు కీలక వ్యక్తులను పట్టుకుని వారి నుంచి ముఖ్యమైన సమాచారం సేకరించాం. రవివర్మకు ముంబయికి చెందిన ముఠాతో సంబంధాలున్నాయి. అక్కడ ఉన్న వాహిద్ అనే వ్యక్తికి విదేశాల నుంచి కొకైన్ వస్తోంది. అతడి నుంచి నిందితులు హైదరాబాద్‌కు డ్రగ్స్ తీసుకొస్తున్నారు. ప్రేమ్ ఉపాధ్యాయ్ అనే వినియోగదారుడిని అరెస్ట్ చేయడంతో ఈ ముఠా గుట్టురట్టయింది. నిందితుల నుంచి రూ.69లక్షల విలువైన డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నాం. కాటేదాన్‌లో డ్రగ్స్ దందా చేస్తున్న రాజస్థాన్‌కు చెందిన పవన్ భాటీని కూడా అరెస్ట్ చేశాం. హేమ్‌సింగ్ అనే మరో వ్యక్తితో కలిసి పవన్ భాటీ డ్రగ్స్ విక్రయిస్తున్నాడు. నిందితులు ముందు జాగ్రత్తగా రివాల్వర్, బుల్లెట్లు కూడా కొనుగోలు చేశారు'' అని సీపీ వివరించారు.

## మహాలక్ష్మి పథకంతో లాభాల్లోకి తెలంగాణ ఆర్టీసీ: భట్టి విక్రమార్క



హైదరాబాద్: తెలంగాణలో మహిళలకు ఉచిత ప్రయాణం సౌకర్యం కల్పించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం మహాలక్ష్మి పథకం తెచ్చినట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు 200 కోట్ల ఉచిత ప్రయాణాలు పూర్తయిన సందర్భంగా ఎంజీబీఎస్‌లో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహాలక్ష్మి పథకం ద్వారా నేడు ఆర్టీసీ లాభాల్లోకి వచ్చిందన్నారు. 200 కోట్ల ప్రయాణాలతో రూ.6 వేల కోట్లు ఆర్జించిందన్నారు. కాంగ్రెస్ హయాంలో ఆర్టీసీ బలోపేతం అవుతోందని పేర్కొన్నారు. ఆక్యుపెన్సీ రేటు ఒకప్పుడు 67 శాతం ఉంటే ఈరోజు 97 శాతానికి వచ్చిందన్నారు. ఆర్టీసీ ఇటీవల వేల సంఖ్యలో కొత్త బస్సులు కొన్నట్లు తెలిపారు. కాలుష్యాన్ని తగ్గించేందుకు ఖర్చుకు వెనకాడకుండా ఎలక్ట్రిక్ బస్సులు కొనుగోలు చేస్తున్నట్లు వివరించారు.

* గత పాలకులు ఆర్టీసీని విధ్వంసం చేశారు: మంత్రి పొన్నం

ఆర్టీసీలో కొత్తగా నియామకాలు జరుగుతున్నాయని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లకు శుభాకాంక్షలు తెలిపారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించామన్నారు. ఆర్టీసీ నష్టాల నుంచి లాభాల్లోకి వచ్చిందని పేర్కొన్నారు. సంస్థలో పెండింగ్ బకాయిలు చెల్లిస్తున్నట్లు తెలిపారు.

## ఇంజినీరింగ్ తొలి దశ కౌన్సిలింగ్ పూర్తి.. 59,980 మంది సెల్ఫ్ రిపోర్టింగ్



హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలోని ఇంజినీరింగ్ కళాశాలల్లో ఎప్‌సెట్ 2025కు సంబంధించి ఇంజినీరింగ్ మొదటి దశ అడ్మిషన్ కౌన్సిలింగ్ పూర్తయింది. తొలి దశలో ప్రభుత్వ, ప్రైవేటు యూనివర్సిటీలు, కళాశాలల్లో మొత్తం 94,059 సీట్లకుగానూ.. 77,561 మందికి సీట్లు కేటాయించారు. అయితే, 59,980 మంది మాత్రమే ఆయా విద్యాసంస్థల్లో సెల్ఫ్ రిపోర్ట్ చేశారు. రెండో దశ కౌన్సిలింగ్ ఈనెల 26 నుంచి ప్రారంభంకానుంది. 26న సర్టిఫికెట్ వెరిఫికేషన్, 26, 27 తేదీల్లో వెబ్ ఆప్షన్లు ఇచ్చుకునే అవకాశం కల్పిస్తున్నట్లు తెలంగాణ ఉన్నత విద్యా మండలి వెల్లడించింది.

## శ్రీశైలం జలాశయానికి కొనసాగుతున్న వరద.. రెండు గేట్లు ఎత్తి నీరు విడుదల

సున్నిపెంట సర్కిల్: పరివాహక ప్రాంతాల నుంచి శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం కొనసాగుతోంది. జలాశయం రెండు రేడియల్ క్రస్ట్ గేట్లను 10 అడుగుల పైకెత్తి స్పిల్‌వే ద్వారా 55,048 క్యూసెక్కులు.. శ్రీశైలం కుడి, ఎడమ గట్టు జల విద్యుత్ కేంద్రాలలో విద్యుత్ ఉత్పత్తి చేస్తూ 66,948 క్యూసెక్కులను అదనంగా నాగార్జున సాగర్‌కు విడుదల చేస్తున్నారు. ఎగువ పరివాహక ప్రాంతాలైన జూరాల నుంచి 39,168, సుంకేసుల జలాశయం నుంచి 36,975 క్యూసెక్కుల వరద నీరు వస్తోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం బుధవారం మధ్యాహ్నం 2 గంటల సమయానికి 883.80 అడుగులు ఉండగా.. నీటి నిల్వ 208 టీఎంసీలుగా నమోదైంది.

## భారత్–పాక్ మ్యాచ్ రద్దు కావడంపై
# స్పందించిన మహ్మద్ సిరాజ్

* ఏం చెప్పాలో తెలియడం లేదన్న మహ్మద్ సిరాజ్
* తన దృష్టి సిరీస్ పైనే ఉందన్న సిరాజ్
* తాను ఇప్పటికీ ఫిట్‌గానే ఉన్నానని వెల్లడి



భారత్ పాక్ మ్యాచ్ రద్దుపై స్టార్ క్రికెటర్ మహ్మద్ సిరాజ్ స్పందించాడు. ఈ విషయంపై తాను ఎలా స్పందించాలో తనకు తెలియడం లేదని వ్యాఖ్యానించాడు. అసలు అక్కడ ఏం జరిగిందో తనకు అవగాహన లేదని, ఏమి మాట్లాడాలో కూడా అర్థం కావడం లేదని అన్నాడు. తన దృష్టి ప్రస్తుతం సిరీస్‌పైనే ఉందని స్పష్టం చేశాడు. తాను సంపూర్ణ ఆరోగ్యంతో, ఫిట్‌గా ఉన్నానని సిరాజ్ వెల్లడించాడు. ఆధునిక క్రికెట్‌లో వర్క్ లోడ్ కూడా ఒక భాగమేనని అభిప్రాయపడ్డాడు. ఎన్ని ఓవర్లు వేస్తున్నామనే దానిపై డేటా అందుబాటులో ఉంటుందని, దాని గురించి తాను ఆందోళన చెందడం లేదని తెలిపాడు. అయితే, తనకు వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని, భారత విజయంలో తనవంతు పాత్ర పోషించడంపైనే దృష్టి సారించానని సిరాజ్ పేర్కొన్నాడు. వరల్డ్ ఛాంపియన్‌షిప్ లెజెండ్స్ టోర్నీలో పాకిస్థాన్‌తో మ్యాచ్ రద్దు చేయబడింది. భారత ఛాంపియన్స్ నిషేధం విధించడంతో నిర్వాహకులు భారత్ పాక్ మ్యాచ్‌ను రద్దు చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఇరు జట్లకు చెరో పాయింట్లను కేటాయించారు.

# ఆసియా' రూల్స్ ఇక్కడెలా అమలుచేస్తారు: స్లో ఓవర్ రేట్ పెనాల్టీపై బెన్

నాలుగో టెస్టులోనూ దూకుడుగా ఆడేందుకు ఏమాత్రం వెనకడుగు వేయమని ఇంగ్లాండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ వ్యాఖ్యానించాడు. భారత్‌తో మాంచెస్టర్ వేదికగా నాలుగో టెస్టు జరగనున్న నేపథ్యంలో స్లెడ్జింగ్ పైనా కామెంట్లు చేసిన బెన్.. ఐసీసీ తమ జట్టుకు జరిమానా విధించడం పైనా స్పందించాడు. స్లో ఓవర్‌రేట్ కారణంగా ఇంగ్లాండ్‌కు 10 శాతం జరిమానాతోపాటు రెండు పాయింట్ల కోత పడిన సంగతి తెలిసిందే. ''ఓవర్ రేట్ విషయంలో నాకేమీ ఆందోళన లేదు. అయితే, మేం కావాలనే చేశామనడం సరికాదు. ఆ సమయంలో ఉండే ఫ్రస్ట్రేషన్‌ను అర్థం చేసుకోగలను.



ఇక్కడి పిచ్‌లపై బౌలింగ్ ఎంత కష్టంగా ఉంటుందో తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. ఆసియాలో ఉన్నట్లుగా ఇక్కడా ఒకే రూల్స్ పెట్టడం సరైంది కాదు. అక్కడ 70 శాతం ఓవర్లను స్పిన్నర్లే విసురుతారు. అదే న్యూజిలాండ్, ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్‌లో ఎక్కువగా సీమ్ బౌలింగ్ వేస్తారు. స్పిన్నర్లు చాలా తక్కువ సమయం తీసుకుంటారు. అందుకే, స్లో ఓవర్ రేట్‌పై కామన్‌సెన్స్‌తో ఆలోచించాలి. కాంటినెంటల్‌ను బట్టి నిబంధనల్లో మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉంది. బషీర్‌కు గాయం కావడం కూడా లార్డ్స్‌లో మేం త్వరగా ఓవర్లను పూర్తి చేయకపోవడానికి ఓ కారణం. ఫాస్ట్ బౌలర్లతో బౌలింగ్ చేయాల్సిన పరిస్థితి'' అని బెన్ స్టోక్స్ వెల్లడించాడు.

**స్లెడ్జింగ్ చేయాలనుకోం..**

''ఐదు టెస్టుల సిరీస్‌లో ఇంగ్లాండ్ భారత్ పోటాపోటీగా తలపడుతున్నాయి. ఇరు జట్లూ నాణ్యమైన క్రికెట్ ఆడుతున్నాయి. మేం అదేపనిగా స్లెడ్జింగ్ చేయాలని అనుకోం. కానీ ప్రత్యర్థి జట్టు ఘర్షణకు దిగితే మేం ఏమాత్రం వెనక్కి తగ్గం. నాలుగో టెస్టుకు తగినంత విశ్రాంతి దొరికింది. ఓ రెండురోజుల పాటు అలాగే పడుకున్నా. నా కుటుంబంతో కలిసి చాన్నాళ్లైందని అనిపించింది. ఇప్పుడీ బ్రేక్‌తో ఈ మ్యాచ్‌కు ఉత్సాహంగా సిద్ధమవుతాం. మాంచెస్టర్‌లో క్రిస్ వోక్స్‌కు మంచి రికార్డు ఉంది'' అని బెన్ వ్యాఖ్యానించాడు.

## నాలుగో టెస్టులో టీమిండియా ఓపెనర్ల శుభారంభం

ఓల్డ్ ట్రాఫర్డ్ టెస్టులో టాస్ ఓడి మొదట బ్యాటింగ్ కు దిగిన టీమిండియాకు శుభారంభం లభించింది. ఓపెనర్లు యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్ నిలకడగా ఆడి, తొలి వికెట్ కు 94 పరుగులతో పటిష్టమైన పునాది వేశారు. కేఎల్ రాహుల్ 98 బంతుల్లో 4 ఫోర్లతో 46 పరుగులు చేసి అవుటయ్యాడు. ఈ వికెట్ క్రిస్ వోక్స్ కు దక్కింది. టాస్ గెలిచి బౌలింగ్ తీసుకుని, పిచ్ పై ఉన్న తేమ కండిషన్ ను ఉపయోగించుకోవాలన్న ఇంగ్లండ్ ఎత్తుగడలు నెరవేరలేదు. జైస్వాల్, రాహుల్ జాగ్రత్తగా ఆడుతూనే, పరుగులు రాబట్టారు. ప్రస్తుతం తొలి ఇన్నింగ్స్ లో టీమిండియా స్కోరు 40 ఓవర్లలో 1 వికెట్ నష్టానికి 120 పరుగులు. క్రీజులో యశస్వి జైస్వాల్ (58 బ్యాటింగ్), సాయి సుదర్శన్ (13 బ్యాటింగ్) ఉన్నారు.

## రూ.35కోట్లు కలెక్ట్ చేసిన మోహన్‌లాల్ కామెడీ డ్రామా..
### తెలుగు ఓటీటీలో..




హైదరాబాద్: మలయాళ సూపర్ స్టార్ మోహన్‌లాల్ నటించిన సినిమాలు తెలుగు ప్రేక్షకులను పలకరిస్తున్న సంగతి తెలిసిందే. అక్కడ విజయవంతమైన పలు చిత్రాలను ఓటీటీ వేదికలు ఇతర భాషల ప్రేక్షకుల కోసం అందుబాటులోకి తెస్తున్నాయి. అలా తెలుగువారిని అలరించేందుకు ఓ మలయాళ కామెడీ డ్రామా సిద్ధమైంది. మోహన్‌లాల్ కథానాయకుడిగా జిబి జోజు దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'ఇట్టిమాని : మేడ్ ఇన్ చైనా'. రాధికా శరత్‌కుమార్, లలిత, హనీ రోజ్, సిద్దిఖీ తదితరులు కీలక పాత్రలు పోషించారు. 2019లో మలయాళంలో విడుదలైన ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకుంది. రూ.12కోట్లతో నిర్మిస్తే రూ.35కోట్లకు పైగా వసూళ్లు రాబట్టింది.

**ఇప్పుడు తెలుగులో ఇలా..**

వినోదాన్ని పంచే వెబ్‌సిరీస్‌లతో పాటు, వైవిధ్యమైన చిత్రాలను ప్రేక్షకులకు అందిస్తోంది ఈటీవీ విన్. ఇప్పుడు మోహన్‌లాల్ నటించిన 'ఇట్టిమాని: మేడ్ ఇన్ చైనా'ను కూడా తెలుగులో తీసుకొస్తోంది. జులై 24వ తేదీ నుంచి ఇది అందుబాటులోకి రానుంది. ఈ విషయాన్ని తెలియజేస్తూ ఈటీవీ విన్ పోస్టర్‌ను పంచుకుంది. ''పరిమితులు లేని నవ్వులకు సిద్ధంకండి 'ఇట్టిమాని మేడ్ ఇన్ చైనా' నవ్వులు పంచే తెలుగు కామెడీ మీకోసం వస్తోంది. జులై 24వ తేదీ నుంచి ఈటీవీ విన్‌లో స్ట్రీమింగ్ కానుంది'' అని సోషల్‌మీడియా వేదికగా తెలిపింది. మోహన్‌లాల్ ఇందులో ద్విపాత్రాభినయం చేశారు. తండ్రీ కొడుకులుగా పాత్రల్లో నటించి

# సినిమా

## 12 గంటలైనా ఓకే



'పరిణీత' మూవీతో బాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చిన బ్యూటీ విద్యాబాలన్. సిల్క్‌స్మిత జీవితకథ ఆధారంగా తెరకెక్కిన చిత్రం 'ది డర్టీ పిక్చర్'తో మంచి గుర్తింపు తెచ్చుకుంది. ముఖ్యంగా మహిళా ప్రాధాన్యమున్న పాత్రలను ఎంచుకొంటూ.. అభిమానుల ప్రశంసలు అందుకుంది. చివరిగా కార్తిక్ ఆర్యన్ హీరోగా నటించిన 'భూల్ భూలయ్యా 3'లో కనిపించింది. అయితే కొన్ని రోజులుగా చర్చనీయాంశంగా మారిన వర్కింగ్ అవర్స్ అంశంపై తాజాగా విద్యాబాలన్ తన అభిప్రాయాన్ని పంచుకుంది. 'బిడ్డకు జన్మనిచ్చిన మహిళలు ఫ్యామిలీతో ఎక్కువ టైం గడపాలి. అలాంటి వారికి చాన్స్ ఇవ్వాలంటే కచ్చితంగా కొన్ని మార్పులు చేయాల్సిందే. అయితే నాలాంటి వారికి బాధ్యతలు తక్కువగా ఉంటాయి. కాబట్టి ఎక్కువ సమాయాన్ని షూటింగ్‌లకు కేటాయించగలం. నేను 12 గంటలైనా చిత్రీకరణలో పాల్గొనడానికి రెడీ ఉన్న. ప్రపంచంలో ఏ ప్రాంతంలో షూటింగ్ చేసినా పాల్గొనగలను. ప్రస్తుతం ఒత్తిడికి దూరంగా ఉంటూ సమయాన్ని ఆస్వాదిస్తున్న. ప్రస్తుతం రెండు సినిమాలకు ఓకే చెప్పా. త్వరలోనే వాటి వివరాలు చెబుతా' అంటూ పేర్కొంది.

## రూ.148.98 కోట్లు



అహాన్ పాండే, అనీత్ పెద్దా ప్రధాన పాత్రలో మోహిన్ సూరి తెరకెక్కించిన సయ్యారా మూవీ బాక్సీఫీస్ వద్ద కలెక్షన్ల వర్షం కురిపిస్తోంది. విడుదలైన ఐదో రోజు ఈ సినిమా.. భారీ వసూళ్లతో ఆషికీ 2 సహా పలు సినిమాలను వెనక్కి నెట్టింది. కేసరి 2 వరల్డ్‌వైడ్‌గా రూ.144.35 కోట్ల కలెక్షన్స్ రాబట్టగా.. సయ్యారా ఆ మొత్తాన్ని కూడా దాటి రూ.148.98 కోట్లు వసూళ్లు చేసింది. ఇప్పటి వరకు జాత్(రూ.119.24కోట్లు), భూల్ చుక్ మాఫ్(రూ.90.78 కోట్లు) చేసిన వసూళ్లను కూడా వెనక్కి నెట్టింది. ఒక్క ఐదో రోజునే ఈ మూవీ ఇండియాలో రూ.25 కోట్లు వసూలు చేసింది. దీంతో ఇండియాలో ఇప్పటి వరకు ఈ మూవీ వసూళ్ల మొత్తం రూ.132.38 కోట్లకు చేరింది. మొదటి రోజు రూ.21.5 కోట్లు, రెండో రోజు రూ.26 కోట్లు, మూడో రోజు రూ.35.75 కోట్లు, నాలుగో రోజు రూ.24 కోట్ల రికార్డ్ కలెక్షన్ల వర్షం కురిసింది.

# అందరికీ అది సాధ్యం కాదు



సౌత్‌సినీ ఇండస్ట్రీలో టాలెంటెడ్ హీరోయిన్లలో నిత్యామేనన్ ఒకరు. చైల్డ్ ఆర్టిస్టుగా చిత్రపరిశ్రమలోకి అడుగు పెట్టిన ఈ బ్యూటీ... స్టార్ హీరోయిన్ గా ఎదిగింది. 'అలా మొదలైంది' సినిమాతో తెలుగులోకి ఎంట్రీ ఇచ్చింది. మలయాళం, తెలుగు, తమిళ్, కన్నడ చిత్రాల్లో నటించిన నిత్య... బాలీవుడ్ లో సైతం మెరిసింది. ఒకప్పుడు బ్యాక్ టూ బ్యాక్ మూవీలతో ప్రేక్షకులను అలరించిన ఈ అమ్మడు.. ప్రస్తుతం సెలక్టివ్‌గా సినిమాలు చేస్తోంది. ప్రెసెంట్ నిత్య 'సార్ మేడమ్'తో పలకరించేందుకు సిద్ధంగా ఉంది. విజయ్ సేతుపతి హీరోగా.. పాండిరాజ్ తెరకెక్కించిన ఈ సినిమా ఈ నెల 25న రిలీజ్ కానుంది. దీంతో పాటు ధనుష్‌తో కలిసి 'ఇడ్లీ కడై' మూవీ షూటింగ్ నిత్య బిజీగా ఉంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ప్రేమపై తన అభిప్రాయాన్ని పంచుకుంది ఈ భామ. ప్రపంచంలో ప్రతిఒక్కరికీ లవ్‌మ్యారేజ్ చేసుకోవడం సాధ్యం కాదని పేర్కొంది. 'ప్రేమ గురించి ఎన్నో సంవత్సరాల క్రితం ఆలోచించాను. పేరెంట్స్, ఫ్యామిలీ, సొసైటీ కారణంగా సోల్‌మేట్ ఉండడం అనివార్యమని గతంలో అనిపించేది. అతడిని వెతికిన సందర్భాలూ ఉన్నాయి. అయితే మనం వేరేరకంగా కూడా జీవితాన్ని ఆనందించవచ్చని తర్వాత అర్థం చేసుకున్న. ప్రతిఒక్కరికీ ప్రేమించిన వ్యక్తినే జీవిత భాగస్వామిగా చేసుకోవడం సాధ్యం కాదు కదా!. రతన్ టాటా కూడా పెండ్లి చేసుకోలేదు. పెండ్లి అనేది జీవితంలో ఓ భాగం మాత్రమే.. అది జరిగినా.. జరగకపోయినా మార్పు ఉండదు. తోడు లేనందుకు ఒక్కోసారి బాధ కలిగినప్పటికీ, స్వేచ్ఛగా జీవిస్తున్నందుకు హ్యాపీగా ఉంది' అంటూ నిత్యామేనన్ చెప్పుకొచ్చింది.



ఐశ్వర్య రాజేష్ ప్రతిభావంతులైన నటి, కానీ ఇప్పుడే ఆమెకు తగిన అర్హతలు లభిస్తున్నాయి. సంక్రాంతి కి వస్తున్నం విజయం తర్వాత, నటికి అవకాశాలు వచ్చాయి మరియు ఆమె కొన్ని ఆసక్తికరమైన సినిమాలలో నటించడానికి చురుకుగా పరిగణించబడుతోంది. ఐశ్వర్య ఇన్‌స్టాగ్రామ్‌లో కూడా యాక్టివ్‌గా ఉంది, అందరినీ ఆకట్టుకుంటోంది. ఆమె ఇటీవల చీరలాంటి డ్రెస్‌లో ఫుల్ స్లీవ్ బ్లౌజ్ ధరించి కొన్ని ఫోటోలను పోస్ట్ చేసింది.

Printed, Published by Mohammed Murthuza. Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. 98660 19778, 89789 60131.